SA
39283

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

స్నేహ

జులై 12, 2009



యాగాల యాగీ

వర్షాల బోగీ ?

హ్యాపీ బర్త్‌డే

(౨౦౦౯ జూలై ౧౨ నుంచి
౨౦౦౯ జూలై ౧౮ వరకు)

టి. అభినయ్
8సం॥,జులై-2001
భారతి-నర్సింహ
పటేల్‌గూడ-రంగారెడ్డి

డి. భువనేశ్వరి
10సం॥,జులై-12
రాజేశ్వరి-రాజయ్య
డోర్నకల్-వరంగల్

కార్తీక వాణి
1సం॥,జులై-2008
సంతోష-మల్లేష్
రాళ్లగూడ-రంగారెడ్డి

ఎన్. అనూహ్య
8సం॥,జులై-13
జ్యోతి-రాజమౌళి
కుమార్‌పల్లి-వరంగల్

కె. ప్రకాష్
జులై
ఎలిజబెత్‌రాణి-నాగేశ్వరరావు
కృష్ణలంక-విజయవాడ

ఎల్. తేజ దర్శిని
1సం॥జులై-12
నాగమణి-జగదీష్
వడ్డాది-విశాఖపట్నం



ఎస్. కరుణాకర్
6సం॥, జులై-2003
హేమలత-ఆశన్న
అలంపూర్-మ॥నగర్

టి. విజయ్‌కుమార్
10సం॥,జులై-1999
కమలమ్మ-ఏసయ్య
అడ్లూర్-నల్లగొండ

టి. ఊషయ్య
జులై
కమలమ్మ-ఏసయ్య
అడ్లూర్-నల్లగొండ

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే పోస్ట్ కార్డు తీసుకోండి. దాని మీద మీ బాబు- పాప పేరు , పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు , తల్లిదండ్రుల వివరాలు రాసి పోస్ట్ చేయండి. అన్నట్టు కార్డు పై కలర్ ఫొటో అతికించడం మరువకండి. అయితే మీ చిన్నారి వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి
ప్లాట్ నెం. 21/1, ఎం.హెచ్ భవన్
ఆజమాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్-500 020

మనలో మాట

మతిమాలిన తోటమాలి!

అనగనగా ఒక అందమైన పూలతోట. దానికి నలుపక్కలా పూర్వీకులు నిర్మించిన గోడ రక్షణగా ఉండేది. తోట రకరకాల పూలూ, చెట్లతో పరిమళభరితంగా ఉండేది. ఉన్నంతలో పండ్లూ కాయలతో కళకళ్లాడేది.

ఓ ఇరవై ఏళ్ల క్రితం దానికో కాపలాదారు వచ్చాడు. తోట ఇంకా బాగా ఎదగాలన్నా, సంవృద్ధంగా పూలూ, పళ్లూ ఇవ్వాలన్నా రక్షణ గోడ తీసేయాలన్నాడు. ఇదేం పిచ్చిపనని కొందరు బుద్ధిశాలులు అడ్డుకున్నారు. అయినా, కాపలాదారు కొంత గోడను బలవంతాన కూల్చేశాడు.

ఏళ్లు గడిచాయి. చాలా మార్పులొచ్చాయి.

తోటలోకి పడమటి గాలి వీచింది! కొత్త గాలికి కొన్ని మొక్కలు పరవశించాయి. తోటమాలి కమ్ కాపలాదారు వాటిని ప్రత్యేకంగా సాకాడు. నిరంతరాయంగా నీరు పోశాడు. కొరత లేకుండా ఎరువులేశాడు. చూస్తుండగానే అవి ఇంతింతై... పెనవేసుకు పెరిగాయి. ఆకాశానికి ఎదిగాయి. రకరకాల ఫలాలనూ అందించాయి. తిన్నవాళ్లు 'ఆహో.. ఓహో' అన్నారు. బయటినుంచి చూసి కొంతమంది 'భళిభళి' అన్నారు. అది విని కాపలాదారు వారసులకు పూనకమొచ్చింది! మొత్తం గోడను ఉన్న ఫళాన పడగొట్టేస్తామన్నారు. గతంలో అడ్డుపడ్డ బుద్ధిశాలులే ఈసారి మరింత గట్టిగా అడ్డుకున్నారు.

ఈలోగా తోటలో చాలా మార్పులొచ్చాయి. బోర విరుచుకొని ఎదిగిన మహావృక్షాల కింద ఒక్కటంటే ఒక్క మొక్కా లేదు! గతంలో కళకళ్లాడిన ఎన్నో పూలమొక్కలు తలలు వాల్చేశాయి. అయినా, తోటమాలి కమ్ కాపలాదారు ఏమాత్రం మారలేదు. కొత్త చెట్లకే దన్నునిచ్చి, పాత మొక్కలకు పాతర వేయడం మొదలెట్టాడు.

ఉన్నట్టుండి పడమటి గాలుల ఉధృతికి పెద్ద తుపాను వచ్చింది.

వేల ఏళ్లుగా వేళ్లూనిన ఎన్నో తోటలు కుప్పకూలిపోయాయి. మనం మాట్లాడుకుంటున్న తోటకూ ముప్పు తప్పలేదు. తోటలోని పెద్ద చెట్ల కొమ్మలు ఫెళఫెళమని విరిగిపోయాయి. వాటిని ఆశ్రయించి ఉన్నవాళ్ల బతుకూ, భవిష్యత్తూ అయోమయంలో పడింది. రక్షణ గోడ లేని మేర- ఉన్న చిన్న మొక్కలూ ప్రభావానికి గురయ్యాయి. ఉన్న రక్షణ గోడ ఎంతో కొంత కాపు కాసింది. బుద్ధిశాలుల దూరదృష్టి తోటను కొంతమేర కాపాడింది. అయినా, తుపాను ప్రభావంతో తోట అతలాకుతలమైంది. అనేక చిన్ని చిన్ని మొక్కలు మోడువారి పోయాయి. పూలూ ఫలాలూ తగ్గి కళావిహీనం అయ్యాయి. తోట మనుగడే పెద్ద సమస్యగా మారిపోయింది.

ఈ తరుణంలో కాపలాదారు మీద మొక్కలన్నీ ఆశలు పెట్టుకున్నాయి. ఉద్ధరణకు, పునరుద్ధరణకు ఏదైనా ఉపాయం ఆలోచిస్తాడనుకున్నాయి. కానీ, అతడు యథాతథంగా పెద్ద చెట్ల పక్షమే వహించాడు. ఎరువులూ, నీరూ అటువైపే మళ్లించాడు. అలా మళ్లిస్తూ, మాటలు మాత్రం ఇలా వల్లించాడు :

♦'తోటలో పండిన పండ్లను మాత్రమే సేకరించినట్టుగా రాజు కూడా ప్రజల దగ్గర ధనం ఉన్నప్పుడే వసూలు చేయాలి. పక్వానికి రాని పండ్లను తీసుకోని విధంగా ప్రజల వద్ద సొమ్ము లేనప్పుడు వసూలుకు పూనుకోరాదు. అలా పూనుకుంటే- ప్రజలు ఆగ్రహోదగ్రులై ఆదాయానికి గండి కొడతారు.'

అసలు తోట ఉనికికే ప్రమాదం ముంచుకొస్తే కాపలాదారు పండ్ల గురించి మాట్లాడాడు. పండ్లు (పన్నులు అనుకొండి) తీసుకోకపోవడమే గొప్ప వితరణగా, సహాయంగా సామాన్యులను, సామాన్యుల్లాంటి పూలమొక్కలను అనుకోమన్నాడు.

ఇప్పుడు పూలమొక్కలకు కావల్సింది పుష్కలమైన నీరూ ఎరువు.

అది అందివ్వనప్పుడు ఎన్ని నీతులు చెప్పినా- 'కౌటిల్యం' అవ్వదు, కుటిలత్వమే అవుతుంది. ప్రజలు ఆగ్రహోదగ్రులవుతారు! మొక్కలు ఎదురుతిరుగుతాయి.

♦ఈనెల 6న ఆర్థికమంత్రి ప్రణబ్ ముఖర్జీ బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ ఉటంకించిన కౌటిల్యుడి రాజనీతి సూత్రాల్లో ఇదొకటి.

★

ఈ సంచికలో....

టపా	...	2
ఆరోగ్యం	...	3
విజ్ఞానవీచిక	...	6
క్రైమ్ కథ	...	7
కవిత్వమ్	...	10
రుచి	...	11
బాల నేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14
కథ	...	17
చూద్దామా	...	20
తెల్సా	...	23

ఇంకా...

స్ఫూర్తి ... 4

నా చైతన్య ప్రవంతిలో అంతర్భాగం ఈ నవల

సీరియల్ ... 8

గని

సమ్‌థింగ్ స్పెషల్... 18

ఎండినవే అయినా మెండైనవే!

నవ్వుల్ పువ్వుల్ ... 24

జోక్స్



ప్రతివారం సీరియల్ చదువుతున్నాం

జూన్ 28 నాటి స్నేహ అట్టమీది కథ... 'అమెరికా స్వాతంత్ర్యం ఒక మేడిపండు' విశ్లేషణాత్మకంగా ఉంది. సమ్‌థింగ్ స్పెషల్‌లో నేరేడు పండు విశిష్టతను డా॥ విజయ్ చక్కగా తెలియజేశారు. ప్రకృతి సహజమైన రాతితో సృష్టించబడే శిల్పాల కంటే శిరామిక్ శిల్పాలు ఎంతో ప్రత్యేకతను కలిగిఉంటాయనడం నిర్వివాదాంశం. పోస్టేనా పిల్లి కూనను అక్కున చేర్చుకుని పెంచుకుంటున్న జంటకు ధన్యవాదాలు చెబుదాం. ఆశారాజు 'నిరతం' కవిత భావగర్భితంగా ఉంది. తెల్సా చాలా నచ్చింది. క్రమంతప్పకుండా 'గని' సీరియల్ ఫాలో అవుతున్నాం. చాలా దూరం దాకా కథ చాలా బాగుంది. విజ్ఞాన వీచిక విభిన్న రీతిలో ఆకట్టుకుంటోంది. కాకులను, పిల్లులను ఆడిపోసుకోవడం అనాది నుండి మానవుడికి అలవాటే. 'మనలోమాట' గా కాకికి ఉన్న బుద్ధి, జ్ఞానం కూడా మనిషికి లేనందుకు సిగ్గుపడాలి. కాకి మన నిరంతర స్నేహ పక్షిరాజం.

నేమాన సుభాష్ చంద్రబోస్,
ఇలిసిపురం, శ్రీకాకుళం.

అనేకవిషయాలు తెలిశాయి

చాలామందికి తమ దేశం కంటే సంస్కృతి కంటే అమెరికాయే గొప్పగా కనిపిస్తుంది. కానీ అమెరికా స్వాతంత్ర్యం మేడిపండు. అక్కడి విష సంస్కృతి కొంతమందికి మాత్రమే తెలుసు. అమెరికా సామ్రాజ్యవాదం, యుద్ధాల చరిత్ర అందరికీ తెలిసిందే. అక్కడ జాతి వివక్షత తాండవిస్తుంది. ఈ వ్యాసం చదవడం ద్వారా మాకు అనేక విషయాలు తెలిశాయి. 'ఆరోగ్యం'లో పిల్లలు- మానసిక సమస్యల గురించి రాశారు. ఇవి అందరూ తెలుసుకోవలసినవి. మెదడులో భౌతికంగా జరిగే రసాయన మార్పుల వల్ల మానసిక రుగ్మతలు వస్తాయని తెలిపారు. పిల్లల్లో మానసిక రుగ్మతలు ఎలా ఉంటాయో తెలుసుకున్నాం. ఇన్ని విషయాలు తెలిపినందుకు డాక్టర్ ప్రభాకర్ గారికి అభినందనలు.

టి. శ్రీరామమూర్తి,
గాజువాక, విశాఖ.

'అమెరికా' కవర్ బావుంది

జూన్ 28 ఆదివారం సంచికలో ప్రచురించిన కవర్ స్టోరీ 'అమెరికా స్వాతంత్ర్యం ఒక మేడిపండు' చాలా బాగుంది. సామ్రాజ్యవాదంతో బ్రిటన్ ఆధిపత్యంపై పోరాడి స్వాతంత్ర్యం పొందిన అమెరికా, చీకటి ఖండమైన ఆఫ్రికా నుండి ఎందరినో తమ స్వలాభానికి బానిసలుగా చేశారు. అమెరికాకు స్వాతంత్ర్యం వచ్చి 234 ఏళ్లు నిండినా, బరాక్ హుసేన్ ఒబామా అమెరికా అధ్యక్షుడైనా, ఇంకా సామ్రాజ్యవాదం సమసిపోలేదు. ఇది సత్యం.

ఆచార్య నూతి నారాయణరావు,
హైదరాబాద్.

...నిప్పును గుప్పెట్లో బంధించడమే

ప్రపంచ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను తమ గుప్పిట్లో బంధించాలనుకోవడం నిప్పును గుప్పిట్లో బంధించినట్లే అవుతుంది. తొలిసారిగా అధ్యక్షుడిగా ఎన్నికైన ఆఫ్రో-అమెరికన్ తరగతికి చెందిన బరాక్ హుసేన్ ఒబామా స్వాతంత్ర్య సందేశం ఇవ్వడం నేటి ప్రాధాన్యత. విద్యారంగంలో తెల్లవారు వందమంది కాలేజీలకు వెళితే నల్లజాతీయులు అందులో సగం మంది మాత్రమే వెళ్తున్నారంటూ కళ్లకు కట్టినట్టు చక్కటి కథనాన్ని అందించారు. అక్కడి విషయాలను చక్కగా విశ్లేషించారు. వివరణ చాలా బాగుంది.

బుర్రి కుమార్‌రాజు,
రత్నపురికాలనీ, గుంటూరు.

దళిత పక్షిగానే మిగిలిపోవాలా?

ఏ దేవతలు ఒప్పుకుంటే కాకి శనీశ్వరుని వాహనమైంది? సంఘజీవి తత్వం, బడుగుజీవన తత్వం, మితాహారం భుజించేతత్వం, కమ్యూనిష్టులాగే కాకికే వుంది. మనలో మాటలో చెప్పినట్టు ఎన్నో సామెతలు, కాకమ్మ కథలు, హీన చరిత్ర కింద చెప్పే కథలే. శ్రీకృష్ణ పరమాత్మ నల్లని నలుపైనా, ఆయన్ను నీలమేఘ శ్యాముడన్నారు. కుక్క బతుకు లిస్టులో కాకి కూడా చేరింది. కర్మకాండలకు, తద్దినాలకు, పిండం తిండి తినడానికి అవసరమైన కాకి నిజంగా దళిత పక్షిగానే మిగిలిపోతుందేమో!

వాస్తురామచంద్ర,
రాంజీనగర్, నెల్లూరు.



వీచిక వివరాలు ఆసక్తికరం

జూన్ 28 ఆదివారం స్నేహలో ప్రచురించిన 'విజ్ఞాన వీచిక'లోని వ్యాసం 'గాజుబిళ్లతో బయట పడ్డ సూక్ష్మ ప్రపంచం' చాలా బాగుంది. దీనిద్వారా అనేక విషయాలు తెలుసుకున్నాం. సైంటిస్ట్ ఆంటన్ వాన్ లీవెన్ హుక్‌కు స్ఫురించిన మైక్రోస్కోపు ఆలోచన సూక్ష్మజీవుల ప్రపంచం ఒకటుందని, జీవకణాలు అందులో నిక్షిప్తమై జీవక్రియల నిర్వహణకు దోహదపడుతుందని, మైక్రోస్కోపు ఉపయోగం, వాడుక, నిర్మాణం గురించి, ఆంటన్ చేసిన కృషి గురించి తెలిపిన వివరాలు చాలా విజ్ఞాన దాయకంగా ఉన్నాయి. సంభాషణాత్మకంగా సాగుతూ ఆద్యంతం ఆసక్తికరంగా సాగి ఎన్నో వివరాలను తెలియజేసింది. కవిత్వం శీర్షికలో ప్రచురించిన రెండు కవితలు చదువరులను ఆకట్టుకునే విధంగా ఉన్నాయి. "అమెరికా స్వాతంత్ర్యం ఒక మేడిపండు" వ్యాసం ఆత్యంత అద్భుతంగా ఉంది. అమెరికా ఆవిర్భావం, ఆనాటి పరిస్థితి, ఈనాటి పరివర్తన, నల్లజాతీయుల బాధలు, అభివృద్ధి, నల్లజాతీయుల ఎదుగుదల చాలా విశ్లేషణాత్మకంగా సాగింది. ఈ వ్యాసం అజరామరంగా చాలా బాగుంది.

కె.వి.ఎస్.నరసింహం ★

ఆరోగ్యం

పిలిచినా పలకడం లేదా?

ఆటిజం వల్ల పిల్లలకు సాధారణంగా వుండాల్సిన ఎమోషనల్ ఫీలింగ్స్ కనిపించవు. తల్లిదండ్రులను చూచి నవ్వటం కాని, కళ్ళలో కళ్ళు పెట్టి చూడటం కాని ఉండవు. పక్కవారి కదలికలుగాని, భావాలుగానీ గమనించరు. చుట్టూ ఉన్న మనుషులను కూడా ఒక వస్తువులా చూస్తారు. తల్లిదండ్రుల పట్ల ఆత్రుత ఉండదు. ఒకవేళ తల్లిదండ్రుల నుంచి విడదీసినా భయాందోళనలు వ్యక్తం చేయరు. మిగతా పిల్లలతో స్నేహం చేయరు. మామూలు పిల్లల లాగా చూసి నేర్చుకునేది కూడా ఉండదు. ఒకే రకమైన ఆటలపై లేదా వస్తువుతో గాని, ఎక్కువ సమయం వెచ్చిస్తారు. ఇది ప్రమాదకరమైంది. కొట్టినా, గాయపరిచినా రోడ్డుపైన ఏదైనా మీదకు వస్తున్నా ఏ మాత్రం గమనించరు.

డా॥ ఎండ్లూరి ప్రభాకర్
సైకియాట్రిస్ట్
అనంతపురం

పిల్లలకు వచ్చే చాలా రకాల మానసిక సమస్యలలో ముఖ్యమైనది ఆటిజం. దీనిని ఇన్‌ఫన్‌టైల్ ఆటిజం అని లియో కెన్నర్ అపే 1943 లోనే విశ్లేషించాడు. ఆటిజం లక్షణాలు అబ్బాయిల కంటే అమ్మాయిల్లోనే నాలుగు రెట్లు ఎక్కువ. 2000 మందిలో ఒకరు ఈ జబ్బుబారిన పడే అవకాశం ఉంది. ఒకప్పుడు ఈ జబ్బు సామాజికంగా, ఆర్థికంగా బాగా అభివృద్ధి చెందిన పిల్లల్లోనే వస్తుందనుకునేవారు. పిల్లల్లో వచ్చే మానసిక జబ్బుల్లో అతి తొందరగా సంక్రమించేదే ఈ జబ్బు. రెండున్నర సంవత్సరాల్లోపు పిల్లల్లో ముఖ్యంగా ఈ జబ్బు వచ్చే అవకాశం ఎక్కువ.

ఆటిజం పిల్లల్లో దాదాపు 30 శాతం మందికి సాధారణ తెలివి తేటలు ఉంటాయి. 70 శాతం పిల్లలకు తెలివి తేటలు తక్కువగా ఉండి నేర్చుకోవడంలో వెనకబడతారు. అన్ని విషయాల్లో ఇతరులపై ఆధారపడతారు. ఈ పిల్లలు జీవితంలో ఎక్కువ కాలం పాటు బాధలనుభవిస్తారు. కేవలం ఒకటి నుండి రెండు శాతం మాత్రమే వివాహం, సామాజిక, వృత్తి పరమైన విషయాలలో సాధారణంగా జీవిస్తారు.

కారణాలు

ఆటిజం రావటానికి ఖచ్చితమైన కారణం తెలియదు. కాని మెదడులో జరిగే బయోలాజికల్ మార్పుల వల్ల ఇది సంభవిస్తుంది. మెదడులో సెరటోనిన్ అనే రసాయనిక ద్రవం ఎక్కువ అవ్వటం, గర్భవతిగా ఉన్నప్పుడు తల్లి 'రుబెల్లా' లాంటి జబ్బుకు గురి కావటం, కాన్పు సమయంలో మెదడు ఒత్తిడికి గురికావటం వంటి కారణాల వల్ల ఇది సంభవించవచ్చు.

లక్షణాలు

ఆటిజం వల్ల పిల్లలకు సాధారణంగా ఉండాల్సిన ఎమోషనల్ ఫీలింగ్స్ కనిపించవు. తల్లిదండ్రులను చూచి నవ్వటం కాని, కళ్ళలో కళ్ళు పెట్టి చూడటం కాని ఉండవు. పక్కవారి కదలికలుగాని, భావాలుగానీ గమనించరు. చుట్టూ ఉన్న మనుషులను కూడా ఒక వస్తువులా చూస్తారు. తల్లిదండ్రుల పట్ల ఆత్రుత ఉండదు. ఒక వేళ తల్లిదండ్రుల నుంచి విడదీసినా భయాందోళనలు వ్యక్తం చేయరు. మిగతా పిల్లలతో స్నేహం చేయరు. మామూలు పిల్లల లాగా చూసి నేర్చుకునేది కూడా ఉండదు. ఒకే రకమైన ఆటలపై లేదా వస్తువుతో గాని, ఎక్కువ సమయం వెచ్చిస్తారు. ఇది ప్రమాదకరమైంది. కొట్టినా, గాయపరిచినా రోడ్డుపైన ఏదైనా మీదకు వస్తున్నా ఏ మాత్రం గమనించరు. భాషాపరమైన ఇబ్బందులు కూడా వీరిలో ఉంటాయి. పిలిచినప్పుడు గమనించక పోవటం, స్పందించక పోవటం వల్ల వినికిడి లోపం ఉందేమోనన్న భ్రమ కల్గిస్తారు. దాదాపు 50 శాతం మంది పిల్లలకు పరిపూర్ణమైన భాష అభివృద్ధి చెందదు. పలికిందే పలకటం, పదాలు తిప్పి చెప్పటం లాంటివి వుంటాయి. తల బాదుకోవటం, చేతులు తిప్పటం, అసాధారణమైన శారీరక కదలికలు కలిగి ఉంటారు. ఇలాంటి పిల్లలు జీవం ఉన్నవాటికి, జీవం లేనివాటికి తేడా గమనించలేరు. కొన్నిసార్లు కోపంగా ప్రవర్తిస్తారు. స్వంతంగా గాయపరుచుకుంటారు. ఫిట్స్ వస్తాయి. నొప్పిగా ఉన్నా, గాయపరిచినా స్పందించక పోవటం ఈ వ్యాధి లక్షణాలు.

ఆటిజంను గుర్తించే విధానాలు

ఆటిజంను గుర్తించటానికి ప్రత్యేకమైన పరీక్షలు లేవు. పై లక్షణాలను క్షుణ్ణంగా గమనించాలి. శారీరక, మానసిక అభివృద్ధిని గమనించి ఈ జబ్బును కొన్ని రకాల స్కిల్స్ సాయంతో నిర్ధారించవచ్చు.

చికిత్స విధానాలు

బిహేవియర్ థెరపీ

చికిత్సా విధానాలలో ముఖ్యమైనది బిహేవియర్ థెరపీ. మొదట ఇటువంటి పిల్లలను ప్రత్యేక అవసరాలు గల పిల్లలుగా గుర్తించి తల్లిదండ్రులు, డాక్టర్లు, సైకాలజిస్ట్‌లు, స్పీచ్ థెరపిస్ట్‌ల సహాయంతో ఒక ప్రత్యేకమైన రెడిమేడ్ ప్రోగ్రామ్‌ను తయారుచేసుకోవాలి. ఇలాంటి పిల్లలతో కలవటం, స్నేహం, సహకారం, స్వంత పనులు చేసుకోగలిగేటట్లు పాజిటివ్ రీఇన్‌ఫోర్స్‌మెంట్ పద్ధతుల ద్వారా ప్రోత్సహించటం చేయాలి.

సైకోథెరపీ

ఇందులో ముఖ్యంగా తల్లిదండ్రులకు ఆ జబ్బు పట్ల అవగాహన కల్పిస్తారు. వారిలో ఉన్నటువంటి భయాందోళనలను పోగొట్టి, నిరుత్సాహపడకుండా పిల్లల్లో మార్పు తేవటానికి అవసరమైన పద్ధతుల పట్ల శిక్షణను ఇస్తారు. ఇవేకాక మెదడులో రసాయనాల సమతుల్యం కోసం మందులు వాడాల్సి ఉంటుంది. ఆటిజం ఉన్న ప్రతి పిల్లవాడిని సైకియాట్రిస్ట్, సైకాలజిస్ట్‌ల సహాయంతో పూర్తిగా విశ్లేషించి... తీవ్రతను గమనించి వారికి ఉన్న జబ్బు తీవ్రతను బట్టి ప్రత్యేకమైన చికిత్సా విధానాన్ని రూపొందించవలసి ఉంటుంది.

★



అంపశయ్య నవీన్

కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత

నా చైతన్య స్రవంతిలో అంతర్భాగం ఈ నవల

'చివరకు మిగిలేది' నవలను 1960లో మొదటిసారి చదివినప్పట్నించి ఇప్పటి వరకు ఎన్నిసార్లు చదివానో లెక్కలేదు. చదివిన ప్రతీసారి ఈ నవలలో నాకొక సరికొత్త జీవిత రహస్యం తెలిసినట్టనిపిస్తుంది. దయానిధి పాత్రలో నేను వున్నాననిపిస్తుంది. నాలోకి నేను చూసుకొని, నన్ను నేను తెలుసుకోవడానికి, నన్ను నేను సంస్కరించుకోవడానికి ఈ నవల దోహదం చేసినంతగా మరే నవలా చెయ్యలేదు. 1967 లో బుచ్చిబాబు చనిపోయిన వార్త విన్నప్పుడు ఎంతగా కుమిలిపోయానో చెప్పలేను. అప్పుడే నేను 'అంపశయ్య' రాయడంలో నిమగ్నమై ఉన్నాను. 'అంపశయ్య' పుస్తకంగా వెలువడగానే దాన్ని బుచ్చిబాబుకు చూపించాలని, ఆయన ఆ నవలను చదివి యేమంటాడో వినాలని కలలు గంటుండేవాణ్ణి.



మంచి పుస్తకాన్ని మించిన నేస్తం ఉండదని నేను నా బాల్యంలోనే తెలుసుకున్నాను. నాల్గో తరగతి చదువుతున్న రోజుల్నుంచి ఇప్పటి వరకు ఎక్కడ ఒక మంచి పుస్తకం కనిపించినా వెంటనే దాన్ని సంపాదించి చదివేయడం, ఆ పుస్తకం గురించి మిత్రులతో చర్చించడం నాకు నిత్యకృత్యంగా మారిపోయింది. మొదట్లో 'చందమామ' లాంటి పిల్లల మేగజైన్స్, జానపద కథల పుస్తకాలు, రామాయణ, మహాభారత కథల్ని చెప్పే పుస్తకాలు ఎక్కువగా చదువుతుండేవాడిని.

హైస్కూల్లో ప్రవేశించాక యాభైలలో డిటెక్టివ్ నవలల్ని విపరీతంగా చదివేవాడిని. ఆరోజుల్లో డిటెక్టివ్ నవలలు విస్తృతంగా వెలువడుతుండేవి. ఈ నవలల్ని అద్దెకిచ్చే షాపులు కూడా ఉండేవి. రోజుకొక పావలా అద్దె. ఈ అద్దె లైబ్రరీల్లోంచి డిటెక్టివ్ నవలల్ని తెచ్చుకొని మూడునాల్గు గంటల్లో ఒక నవలను చదవడం పూర్తి చేసేవాడిని. గంటలగంటలు పుస్తకాలు చదివే ఒక మంచి అలవాటు డిటెక్టివ్ నవలల వల్లనే యేర్పడిందని చెప్పాలి.

హైస్కూలు చదువు ముగించుకొని వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో చేరాక డిటెక్టివ్ నవలలు చదవడం మానేసి సీరియస్ లిటరేచర్ చదవడం మొదలెట్టాను. అప్పుడే అడివి బాపిరాజు, విశ్వనాథ సత్యనారాయణ, కొడవటిగంటి కుటుంబరావు, చలం, గోపీచంద్ మొదలైన రచయితల్ని గూర్చి మా తెలుగు అధ్యాపకుడు కృష్ణమూర్తి గారు చెబుతుండేవాడు. కాలేజీ లైబ్రరీ నుండి వారి పుస్తకాలు తీసుకొని అదే పనిగా చదువుతుండేవాడిని. డిటెక్టివ్ నవలల్ని కేవలం తర్వాత యేమౌతుందన్న ఉత్కంఠతో చదివేవాడ్ని. కానీ ఈ సాంఘిక నవలల్ని చదువుతోంటే ఎన్నో కొత్త విషయాలు తెలిసేవి.

ఒకరోజు నా కంటె ఒక సంవత్సరం సీనియర్ అయిన ముదిగొండ వీరభద్రయ్య అనే మిత్రుడితో నవలల గూర్చి మాట్లాడుతోంటే ఆయన 'నువ్వు చివరకు మిగిలేది చదివావా?' అని అడిగాడు. "చదవలేదు" అనగానే "వెంటనే చదువు. నీ మనస్తత్వానికా నవల బాగా సరిపోతుంది" అన్నాడు. "అది బుచ్చిబాబు రాసిన యేకైక నవల" అని కూడా చెప్పాడు (ఈ వీరభద్రయ్యే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో తెలుగు ప్రొఫెసర్‌గా పనిచేసి రిటైరయ్యాడు).

'చివరకు మిగిలేది చదవటానికి ముందు నేను బుచ్చిబాబు రాసిన కొన్ని కథల్ని చదివాను. ఇదివరకు నేను చదివిన కథలకు ఈ కథలు ఎంతో భిన్నంగా ఉన్నాయనిపించింది. వీరభద్రయ్య చెప్పగానే ఆ నవల కోసం అన్వేషణ ప్రారంభించాను. కాలేజీ లైబ్రరీలో ఆ నవల ఉంది. కానీ ఇంకెవరో తీసుకున్నారని లైబ్రేరియన్ చెప్పాడు. ఒక నెలరోజులు పదేపదే లైబ్రేరియన్‌ను 'ఆ నవల వచ్చిందా?' అని అడిగాక ఒకరోజు వచ్చిందని ఆ నవలను నా చేతికిచ్చాడు.

ప్రప్రథమంగా ఆ నవలలోని ప్రకృతి వర్ణనలు నా కళ్ళు జిగేలు మనిపించాయి. ఇది వచనమా? లేక కవిత్వమా? అనిపించింది.

నవలలోని మొట్టమొదటి వాక్యం. "చివరకు మిగిలేదేమిటి? దీనికి సమాధానం తెలిస్తే జీవిత రహస్యం తెలుసుకున్నట్టే".

ఈ నవలలోని చివరి వాక్యం.

"చివరకు మిగిలింది దాని సమాధానం కాదు, సమాధానం తెలుసుకునేటందుకు తను చేసిన యత్నాల జ్ఞాపకాలు – తనతో తను సమాధానపడటం– అది మిగిలింది" అనుకుంటాడు ఈనవలలోని నాయకుడు దయానిధి.

తనేమిటో తెలుసుకొని తనతో తను సమాధానపడ్డప్పుడే మనిషికి మానసిక శాంతి లభిస్తుందని ఈ నవల సందేశం. తనతో తను సమాధాన పడటమంటే యేమిటి? మనిషిలో పరస్పరం సంఘర్షించుకునే ఎన్నో శక్తులుంటాయి. మంచీ, చెడు, ప్రేమ, ద్వేషం, పగ, క్షమ, సహనం, అసహనం – వీటి మధ్య సమన్వయాన్ని సాధించటం– అలాగే వ్యక్తికీ, సమాజానికి మధ్య సంఘర్షణ ఉంటుంది. సమాజం వ్యక్తిని తను విధించిన కట్టుబాట్లకు అనుగుణంగా నడుచుకోమంటుంది. ఇది వ్యక్తి స్వాతంత్ర్యాన్ని నియంత్రించే అంశం. సమాజం చెప్పినట్టుగా నేనెందుకు వినాలి. నాకేది మంచిదని తోస్తే దాన్నే ఆచరిస్తానంటాడు వ్యక్తి. అలాగే వ్యక్తి తన భావాలకనుగుణంగా సమాజాన్ని మార్చాలని ప్రయత్నిస్తాడు. మార్పును సమాజం సులభంగా అంగీకరించదు. ఇలా వ్యక్తికి, సమాజానికి మధ్య సంఘర్షణ అనివార్యమౌతుంది. ఇలాంటి సంఘర్షణలేవీ లేకుండా మొదలు తనతో తను సమాధానపడి సమాజంతో సమాధానపడటమే వ్యక్తి సాధించాల్సిన లక్ష్యమని, ప్రతి వ్యక్తి చివరకు ఈ లక్ష్యాన్ని సాధించటం కోసమే శ్రమిస్తాడని ఈ నవల చెబుతుంది.

ఈ నవలలో కనిపించే మరొక కొత్తదనమేమిటంటే నవలను కొన్ని అధ్యాయాలుగా విభజించి ఒక్కొక్క అధ్యాయానికి ఒక్కో పేరు పెట్టడం.

మొదటి అధ్యాయం పేరు 'గడ్డిపోచ విలువెంత?' ఆ తర్వాతి అధ్యాయాలు: 'అనుభవానికి హద్దులు లేవు, మూణ్ణాళ్ళ ముచ్చట, చప్పుడు చెయ్యని సంకెళ్ళు, సౌందర్యరాహిత్యం, స్వయం సంస్కారం, చీకటి సమస్య, రాళ్ళసీమ, కాత్యాయని సంతతి, ఆకులు రాలడం, చివరకు మిగిలేది'. పేరుకు తగ్గట్టుగా ప్రతి అధ్యాయంలో ఒక ముఖ్యమైన సంఘటన జరుగుతుంది.

'చివరకు మిగిలేది' నవలను 1960లో మొదటిసారి చదివినప్పట్నించి ఇప్పటి వరకు ఎన్నిసార్లు చదివానో లెక్కలేదు. చదివిన ప్రతీసారి ఈ నవలలో నాకొక సరికొత్త జీవిత రహస్యం తెలిసినట్టనిపిస్తుంది. దయానిధి పాత్రలో నేను వున్నాననిపిస్తుంది. నాలోకి నేను చూసుకొని, నన్ను నేను తెలుసుకోవడానికి, నన్ను నేను సంస్కరించుకోవడానికి ఈ నవల దోహదం చేసినంతగా మరే నవలా చెయ్యలేదు. 1967 లో బుచ్చిబాబు చనిపోయిన వార్త విన్నప్పుడు ఎంతగా కుమిలిపోయానో చెప్పలేను. అప్పుడే నేను 'అంపశయ్య' రాయడంలో నిమగ్నమై ఉన్నాను. 'అంపశయ్య' పుస్తకంగా వెలువడగానే దాన్ని బుచ్చిబాబుకు చూపించాలని, ఆయన ఆ నవలను చదివి యేమంటాడో వినాలని కలలు గంటుండేవాణ్ణి. బుచ్చిబాబు మరణవార్త వినగానే అప్పుడే మేం వెలువరిస్తున్న 'సృజన' పత్రికను బుచ్చిబాబు స్మారక సంచికగా తీసుకురావాలని నేనూ, వరవరరావు నిర్ణయించాం. 'ఈ సంచికకు నువ్వే ఎడిటర్‌గా ఉండ'మని వరవరరావు చెప్పాడు. అలా 1967లో బుచ్చిబాబు ముఖచిత్రంతో వెలువడిన 'సృజన'కు నేను "కళాతపస్వి" పేరుతో సంపాదకీయం రాశాను. అదే సంచికలో 'దయానిధి మనస్తత్వ పరిశీలన' పేరుతో పెద్ద వ్యాసం రాశాను. ఫ్రాయిడ్ మనోవిశ్లేషణా సూత్రాల నేపథ్యంతో దయానిధి మనస్తత్వాన్ని విశ్లేషించి ఈ వ్యాసాన్ని నేను బుచ్చిబాబుకే అంకితం చేశాను. తెలుగు సాహిత్య విమర్శలో ఫ్రాయిడ్ మానసిక విశ్లేషణను ప్రవేశపెట్టిన మొట్టమొదటి వ్యాసం ఇదేనని విమర్శకులు భావించారు.

'చివరకు మిగిలేది'లో దయానిధి ద్వారా బుచ్చిబాబు చెప్పిన కొన్ని జీవిత సత్యాలు నన్నెంతో ప్రభావితం చేశాయి. అలాంటి వాటిల్లో కొన్ని.

"ఆర్థిక సాంఘిక చారిత్రక వ్యత్యాసాల కతీతమై – మనిషినీ, మనిషినీ స్నేహపాశంలో బంధించి వేసే మానవత్వం యొక్క శక్తుల్ని తరచి చూసినప్పుడు, ఆ దృశ్యాన్ని తన్మయత్వంతో అనుభవించగలం కానీ ఆ అనుభవాన్ని మాటల్లో చెప్పలేం. ఇది జీవిత రహస్యం. దాన్ని తెలుసుకోవడానికి మానవుడు చేసే యత్నమే ఏ గొప్ప గ్రంథానికైనా పునాది. ఈ నవలకీ అదే పునాది" అంటాడు బుచ్చిబాబు ఈ నవలకు రాసిన ఉపోద్ఘాతంలో.

దయానిధికి తల్లంటే ప్రాణం. ఆమె చనిపోయినప్పుడు దయానిధి ఆలోచనలు ఎలా వుంటాయో చూడండి.

"జెరసొప్పా, నయాగరా జలపాతాలు, హిమాలయ పర్వతాలు, సింధూ భాగీరథీ నదులూ, వీటికి మల్లే తల్లి ఎప్పుడూ ఉండి పోతుందనుకున్నాడు. ఇవి లేకుండా తన జీవితమే లేదు. సృష్టి వెనక్కి వెళ్ళినట్లయింది. అంతా ఐపోయింది. తండ్రికి భార్య, సంఘానికి దిద్దుకోవటం చేతకాని సంసారి, కుటుంబానికి ఇల్లాలు, లోకానికి ఒకావిడ, సృష్టికి స్త్రీ, తనకి మాత్రం అమ్మ, ఈ సంఘం ఒక సముద్రం అయితే అతడు నిలబడేందుకు అమ్మ ఒక లంగరు. ఇప్పుడాలంగరు లేదు. ఏదో శక్తి అతన్ని వదిలిపోయింది. అతన్ని ప్రపంచానికి బంధించిన గొలుసులో గొళ్ళెం ఊడింది" 1992లో మా అమ్మ చనిపోయినప్పుడు నేనూ సరిగ్గా ఇలాగే దయానిధిలాగే ఫీలయ్యాను.

నా జీవితంలోని అనేక సందర్భాల్లో నాకు నేను సమాధానం చెప్పుకొని నన్ను నేను ఓదార్చుకునేలా చేసిన 'చివరకు మిగిలేది' నవల నా చైతన్య స్రవంతిలో అంతర్భాగమైపోయింది.

✶

"జెరసొప్పా, నయాగరా జలపాతాలు, హిమాలయ పర్వతాలు, సింధూ భాగీరథీ నదులూ, వీటికి మల్లే తల్లి ఎప్పుడూ ఉండి పోతుందనుకున్నాడు. ఇవి లేకుండా తన జీవితమే లేదు. సృష్టి వెనక్కి వెళ్ళినట్లయింది. అంతా ఐపోయింది. తండ్రికి భార్య, సంఘానికి దిద్దుకోవటం చేతకాని సంసారి, కుటుంబానికి ఇల్లాలు, లోకానికి ఒకావిడ, సృష్టికి స్త్రీ, తనకి మాత్రం అమ్మ, ఈ సంఘం ఒక సముద్రం అయితే అతడు నిలబడేందుకు అమ్మ ఒక లంగరు. ఇప్పడాలంగరు లేదు. ఏదో శక్తి అతన్ని వదిలిపోయింది. అతన్ని ప్రపంచానికి బంధించిన గొలుసులో గొళ్ళెం ఊడింది" 1992లో మా అమ్మ చనిపోయినప్పుడు నేనూ సరిగ్గా ఇలాగే దయానిధిలాగే ఫీలయ్యాను.

విజ్ఞాన వీచిక



సూక్ష్మదర్శిని లేకుండా వైద్యమా!

- డాక్టర్ దేవరాజు మహారాజు

(దేవుడి ముందు గంట మోగిన శబ్దం)

పేషెంట్ షేక్‌మియా :(దగ్గరగా వస్తూ) ఆఁ- ఏం యాదగిరన్నా మీ డాక్టర్ సాబొచ్చిండా?

అయ్యగిదేందీ? మైక్రోస్కోపుకు పూజ జేస్తాండు? ఏదో దేవుళ్ళకు పూజ జేసుడు నూశినం గని ఈయనేంది దవాకాన్ల మైక్రస్కోపుకు పూజజెయ్యబట్టి. అబ్బ అబ్బ ఏం నిష్ట? కన్ను చెదరకుండ దండం బెడతాండు. (కొంచెం ఆగి గొంతు తగ్గించి) ఈ కాంపౌండర్ యాదగిరికి పిచ్చిగాని లేశిందా ఏంది? ఆఁ- కదలడు మెదలడు. ఈడ దేవుని ఫోటువ కూడా లేదు. మైక్రోస్కోపుకు పూజజేసుడు నేనేడ జూడకపోతి. ఏ.. నీయ్యాహ.. తీరు తీరు దునియ.

కాంపౌ.యాద: ఆఁ- ఎవరూ? (గుర్తుపట్టి) అరె షేక్ మియా ! దా.. కూసో. డాక్టర్ సాబ్ ఒచ్చే టైమయ్యింది. ఇయ్యాల పేషంట్లల్ల పైలి నెంబర్ నీదే. అవ్వల్దర్జ గుండెటోనివి. ఏమైంది. ఇటొచ్చినవ్?

షేక్: ఊకూకెనె కడ్పుల నొప్పొస్తాంది. శానొద్దులాయె.. ఒశమైతలేదు. ఇగ డాక్టర్‌సాబ్ తాన ఇలాజు మొదలు పెడదామని ఒస్తి. అవును గనీ గిదేం పూజ? మైక్రోస్కోపుకు దండాలు బెట్టబడ్తివి?

కాంపౌ : నువ్వే గాదు, మా క్లినిక్‌కు వచ్చే పేషంట్లందరు గిదే అడుగుతాండ్రు. మా డాక్టర్ సాబ్ పాథాలజిస్టు. ఆయన ప్రాక్టీసంత ఈ మైక్రోస్కోపు మీదనే ఉంది. ఆయన మీద నేనున్న. ఏ మంటవ్? మా ఇద్దరికి తిండి పెట్టేది గీ మైక్రోస్కోపు గదనే. మమ్ముల మాకుటుంబాల సల్లగా జూశెడిది గీ మైక్రోస్కోపే గద? అంద్కని దండం పెడతాన. అదిగాక రోజుకు కొన్ని వందల, వేల, లక్షల, కోట్ల మంది రోగాలేంటియో ప్రపంచం మొత్తం మీద తెలియజెప్పేది గీమైక్రోస్కోపే గదనే. దేవుని సమానం కాదంటవా? అరె, తిండి బెడ్తాంది. బత్కు కాపాడ్తాంది. ఇంకేం కావాలె షేక్‌సాబ్?

షేక్: అవును కాంపౌండర్ సాబ్. నాకు సమఝయ్యింది. కానీ..

కాంపౌ: కాని గీని ఏం లేదు. ఎవ్వలు ఒప్పుకున్నా ఒప్పుకోక పోయినా నాకు నమ్మకం కుదిరింది. బస్ గంతే? మానవ సేవే మాధవ సేవని అంటున్నారు గదనే. ఈ మైక్రోస్కోపు ఎంతమంది మనుషులకు సేవ జేస్తాంది? రక్త పరిక్ష, ఉమ్మి పరిక్ష, మూత్ర పరిక్ష, మల పరిక్ష ఒక్కటా? అన్ని పరిక్షలకు ఇది లేంది నడ్వదు.

షేక్ : అవ్, అదయితే నిజం! మీ డాక్టర్లకే కాదు, కాలేజి పోరగాల్లకు భీ అవుసరమే. మెరా బడా బేటా కాలేజిమే పడ్‌తేహైనా. ఓ బోల్‌తే రహతే హై. బయాలజి ప్రాక్టికల్స్ వగైరా ఇస్సె కరాతే కర్తేనా. మైక్రోస్కోపు లేకపోతే పాతాలజి లేదు. బయాలజీ లేదు. రీసర్చ్ లేదు. మెడిసిన్ చదువులేదు. ఎగ్రికల్చర్ కూడా లేదట.అగో యాదగిరన్న గప్పుడే నేననుకున్నా. గిదేదో జాన్ బచానే వాలి ఛీజ్ హై. అని! గిది ఎప్పుడు కనుక్కున్నరు?

కాంపౌ : డాక్టర్ సాబ్ చెప్తడు. మూడు వందల ఏండ్ల కిందట కనుక్కున్నరట. కనుక్కున్నప్పటి నుంచి మారుతూనే ఉంది. సింపుల్ మైక్రోస్కోపులు ఒచ్చినయి. ఫొరెసెన్స్ - అల్ట్రా వయొలెట్- ఇంకా ఎన్నెన్నో రకాల మైక్రోస్కోపు లొచ్చినయి. కొన్ని కొన్ని ఆపరేషన్లు మైక్రోస్కోపు కింద జేస్తాండ్రు.

షేక్ : ఆపరేషన్లు మైక్రోస్కోపు కింద చేస్తరా? కత్తులు, కత్తెర్లు, సూదులు అన్నీ మైక్రోస్కోపు కిందికి ఎట్లబోతయ్?

కాంపౌ: మైక్రోస్కోపు కింద ఆపరేషన్ జేసేటివి కత్తులు, పట్కార్లు వేరే అలగ్ ఉంటాయి. స్పెషల్‌గ జేస్తరు. మైక్రోస్కోపు పాథాలజి లాబ్‌ల నుంచి ఆపరేషన్ థియేటర్లకు పోయి చాన ఏండ్లయ్యింది. ఒక్క అణువు... అంటె ఆటమ్ కన్న చిన్న సైజుల ఉన్నాయి కూడా పెద్దగా కనిపిస్తయ్. అక్కడ ఉన్న ఆబ్జెక్ట్‌ని ఒక లక్ష రెట్లు పెద్దది జేసి చూపిస్తది.

షేక్ : అరె బాప్‌రే. అంతనా ఇయ్యాల్రేపు ఎండోస్కోప్ అని అంటుండ్రు. మల్ల గదేంది? పేట్ కె అందర్ భేజ్‌కె ఫొటో ఖీంచ్‌తే కర్తేనా?

కాంపౌ : ఓ ఇగ గదయితే తాజీబ్ చెయ్యాల్సిన సంగతి లోపలి ఏ భాగంలనైనా మైక్రోస్కోపు తోటి ఫోటో తియ్యొచ్చు. శరీరంల లోపలి భాగాలన్ని బాగున్నది లేనిది పరిక్ష జేస్తది. చాన చిన్న చిన్న మైక్రోస్కోపులుంటాయి. నోట్లో నుండి లోపలికి పంపిస్తరు. లోపలి సంగతి ఎట్లున్నది. డాక్టర్లు సూశి చెప్తరు. ఇన్నవా? దునియ చాల తరక్కీ అయ్యిందిరభై ఏమంటవ్? ఈ రక్త నాలాలుంటాయి గద. ఒక్కొక్కసారి అండ్లగ్గూడ మైక్రోస్కోపులు పంపిస్తారు.

షేక్ : అగో అదెట్ల?

కాంపౌ : అదె జెప్తాన. అది లోపల ఏం జేస్తది? మనం చీకట్ల టార్చి పట్కపోతంలే గట్లనే.. గీ మైక్రోస్కోపు లోపల లైటేస్తది. లోపలి తఫ్‌సీల్లన్ని ఖుల్లం ఖుల్ల కనిపిస్తయ్. నీ కిడ్నీ ఉందనుకో అండ్ల ఏమన్న ఖరాబీ ఉంటే కనిపిస్తది. ఊపిరి తిత్తులున్నాయనుకో. అండ్ల ఏమన్న ఖరాబీ ఉంటే కనిపిస్తది. ఇగ ఏం జెప్పాలె! ఒకటా రెండా ఎన్నో సౌలతులు. మైక్రోస్కోపు ఒచ్చినంక శరీరంల రహస్యం అన్నది లేదు.

షేక్ : అ..మ్మా...! మనిషి ఎంత ముందు కొచ్చిండూ? వాకీ.. బహుత్ తరక్కీ కరే భై... మాన్ లేనా.

కాంపౌ : (అడుగుల చప్పుడు) అగో డాక్టర్ సాబొస్తాండు. కావాలంటే అడుగు. నేను జేప్పిన దాంట్లె ఎమన్నా అబద్ధ మున్నదేమో....!

షేక్ : అరెరె ఎంతమాట. అబద్ధమేమున్నది భాయిసాబ్. శానబాగ జెప్పినావ్.. షుక్రియ.

★

క్రైమ్ కథ

ఉచ్చు

- యర్నాగుల సుధాకరరావు

క్రయిమ్‌బ్రాంచి ఇన్‌స్పెక్టర్ ఆఫీసుకొచ్చి మరీ రజనీకాంత్‌ను రెండుగంటలపాటు అనేకప్రశ్నలు వేసి వెళ్లిపోయాడు. అతడు అలా వెళ్లగానే ఫోన్ మోగింది.

"హలో రజనీ! నేను గుర్తున్నానా? మూడేళ్లక్రితం ఒక మర్డర్ చేశాం. ఎక్కడా మన గుట్టు రట్టు కాకుండా ఎంతో జాగ్రత్తపడ్డాం. ఈరోజు పోలీస్ వల మనకు చేరువలోనే తచ్చాడుతోంది. నాకోసం పదేపదే పోలీసులు నాగదికి వస్తున్నారు. నేను వారికి దొరక్కుండా తప్పించుకుని తిరుగుతున్నాను. ఏక్షణమైనా మనం దొరికిపోతాం. నాకు ఇక్కడ నీలాంటివాడే ఒకడు లక్షరూపాయలు ఇవ్వాల్సిఉంది. వాడిస్తేగాని నేను ఊరువదిలి పోలేను. పోలీసులు జాగిలాల్లా వెంటాడుతున్నారు"

"ఏయ్ ఎవరయ్యా నువ్వు? ఏదేదో మాట్లాడుతున్నావు. నేను బుద్ధిగా వ్యాపారం చేసుకునేవాడిని. నాకు హత్యలు, ఘోరాలు చేసే క్రిమినల్స్‌తో సంబంధాలు లేనేలేవు. ఇప్పుడే పోలీసులు నీలాగే వచ్చి వాడెవడో చచ్చాడంట. వాడిని నేనే చంపానని యక్షప్రశ్నలు వేశారు. వారు వెళ్లాక నువ్వు ఊరు పేరు లేకుండా ఏమిటి హత్యలగోల!"

"ఏమ్‌గా మారిపోయాడా ఈ సంథాల్? ఇప్పుడు నాపేరు వినగానే యాద్‌కొచ్చిందా? మనిద్దరం కలిసి ఆ హత్య ఎలాచేశామో గుర్తుచేయాలా?"

"ఎవరయ్యా నువ్వు బుద్ధి లేకపోతేసరి పెట్టు ఫోన్" అంటూ ఫోన్ పెట్టేశాడు రజనీకాంత్. విపరీతంగా చెమటలు పోశాయి. తన ఛాంబర్‌లోకి ఎవరిని పంపొద్దని స్టాఫ్‌కు చెప్పేసి తల పట్టుకుని కూర్చున్నాడు. మూడేళ్లక్రితం తనతో గొడవలుపడ్డ మహేంద్రను తానే కక్షకట్టి వలవేసి చంపేశాడు. అప్పటిలో హంతకులు ఎవరైంది తెలియక కేసు నీరుగారిపోయింది. ఇప్పుడు తిరిగి పోలీసులు ఆరాలు తీస్తున్నారు. ఆ సంథాల్‌గాడిని పోలీసులు వెతుకుతున్నారు. వాడు ఇక్కడే పోలీసులకు దొరక్కుండా తిరుగుతున్నాడు. ఆవెధవ ఎటైనా పారిపోయి ఉండాల్సింది. ఎందుకో ఇక్కడే ఛస్తూ నామెడమీద కత్తి అయ్యాడు."

తన సెల్‌లో సిమ్ మార్చేసి సంథాల్‌కు రింగ్‌చేసాడు. "ఇటువైపు సంథాల్ అటువైపు ఎవరు?" కదులుతున్న ట్రయిన్ శబ్దంలో గట్టిగా అరిచాడు.

'రేయ్ సంథాల్ నేనే రజనీకాంత్‌ను. నీవు ఆరోజు సిటీ వదిలి పోకుండా ఇక్కడే తగలడ్డావు. పోలీసులు ఆకేసు తిరగతోడుతున్నారు. నువ్వు ముందు పారిపో! నీకోసం పోలీసులు వెతుకుతున్నారని చెబుతూనే వారితో దోబూచులాడుతున్నావు. దొరికితే నువ్వు నేను ఉరికంబం ఎక్కాల్సిందే. నీకేమైనా డబ్బు కావాలంటే ఈసెల్‌కు మెసేజ్ ఇవ్వు. పంపేస్తాను. మరి నాకు కన్పించవద్దు. ఇందాక నీవు ఫోన్‌చేస్తే నిన్ను పోలీసులు పట్టుకుని నీతో మాట్లాడిస్తున్నారని నేనే మాటమార్చాను. ఇప్పుడు వేరేనెంబర్‌తో నిన్ను కలిశాను. నువ్వు ట్రయిన్‌లో ఉన్నావు. ఓకే"

"నాన్సెన్స్ నీకు మతి చెడింది. నీకు అసలు భయంలేదు. పోలీసు వలలో ఉంటూ ఎంత ధీమాగా మాట్లాడుతున్నావు?"

"సెల్‌కు మెసేజ్‌లు వద్దు. నువ్వు నాకు పెద్ద ఎమౌంట్ ఇవ్వొద్దు. కేవలం రెండే రెండు లక్షలు ఇప్పించు. పోలీసులు కాదుకదా ఇంటర్‌పోల్ వెంటపడినా దొరకనంత దూరంగా పారిపోతాను. నాకు మాత్రం ఊచలంటే ఇష్టమా? డబ్బుతో వచ్చేయ్. మూసేసిన వీనస్‌బార్‌లో దాక్కున్నాను. నువ్వు ఎంత త్వరగా వస్తే నేను అంత త్వరగా పారిపోతాను"

"నేను నిన్ను కలవలేను. నాపై పోలీసు నిఘా ఉంది. నీఆన్‌లైన్‌నెంబర్ చెప్పు. అందులో వేయిస్తాను"

"ఏయ్ రజనీ, బుద్ధుందా? నేను కిరాయిహంతకుడుగా నీవు చేయించిన హత్యలో ఇన్‌వాల్వయి ఉన్నాను. నాకు ఆడబ్బు తెచ్చిచ్చేయ్. నీవద్ద మరోసారి డబ్బు తీసుకోవడం నాకిష్టంలేదు. కానీ తప్పని పరిస్థితి. నీవు మళ్లీ పోలీస్ ఇంటరాగేషన్‌లో ఉన్నందున నాకు మంచి అవకాశం దొరికింది. పెద్దమొత్తం కొట్టేయగలను కానీ, పెద్దమొత్తం గుంజుకోకుండా వదిలేస్తున్నా"

"నాన్సెన్స్ నీకు మతి చెడింది. నీకు అసలు భయంలేదు. పోలీసు వలలో ఉంటూ ఎంత ధీమాగా మాట్లాడుతున్నావు? మరొకడైతే ఊరికి దూరంగా పారిపోతాడు. ఛ అనవసరంగా నీతో పెట్టుకున్నాను. సరే నీవుండే చోటుకు నేనే వస్తాను వచ్చేటప్పుడు ఇదే నెంబర్ ఫోన్‌లో నీతో మాట్లాడతాను"

ఏ.సి.లో ఉన్నా రజనీకాంత్ చెమటలు పోశాయి. వెంటనే ఫోన్ మ్రోగింది. ఫోన్‌లో మెసేజ్ వచ్చింది. ఆత్రంగా చదివాడు. నీవన్నట్లే ఆన్‌లైన్‌లో డబ్బు వేసేయ్. నేను మరి ట్రయిన్ దిగను. వెళ్లిపోతున్నాను. వేరెవ్వరితో వేయించకు. నాపేరు చూశాక ఏరోజైనా పోలీసులు నీస్టాఫ్‌ను ఇంటరాగేట్ చేస్తే చాలా ప్రమాదం. రజనీకాంత్ మెసేజ్ నాలుగైదుసార్లు చదివి వెంటనే సమీపబ్యాంకుకు కారులో బయల్దేరాడు. తనవెనుక ఎవరైనా ఫాలో అవుతున్నారేమోనని చూశాడు. బ్యాంకులోపలకి వెళ్లి అక్కడ వెతికాడు. తెలిసిన ముఖం కన్పిస్తే పిలిచి ఓచర్ నింపమని తను నోట్‌చేసుకున్న ఆన్‌లైన్ నెంబర్ అతడిచే రాయించి ఆపైన కౌంటర్‌లో నేరుగా కట్టకుండా బ్యాంకు మేనేజర్ వద్దకువెళ్లి రెండులక్షలుఇచ్చి జమ చేయమని కోరాడు. మేనేజర్ క్యాషియర్‌ను పిలిచి ఇచ్చేశాడు. ఐదునిముషాల్లో రిసీట్ వచ్చేసింది. మేనేజర్ దాన్ని ఇచ్చేస్తూ చూసి "ఇదేమిటి సార్ మీరే స్వయంగా వచ్చి కడుతున్నారు. పైగా ఈ ఎకౌంట్ ఒకగంటక్రితం ఓపెన్ అయ్యింది. పోలీసు పెద్దలు కోరితే క్షణాల్లో ఓపెన్ చేసాం. ఇదేమైనా పోలీసులకు ఫండుగా పంపుతున్నారా? రెండు లక్షలు వేశారు. లేకుంటే వేరే పార్టీనా?"

ఆమాటలకు రజనీకాంత్ అదోలా చూస్తుండగా పోలీసులు చుట్టుముట్టారు. "మిస్టర్ నీవు చేతులకు మట్టి అంటకుండా మహేంద్రను చంపావు. ఇప్పుడు నీవు పోలీసు వలకు తగిలిన చేపలా గిలగిల కొట్టుకుంటున్నావు. పక్కా ఆధారంతో నిన్ను పట్టుకున్నాం. సంథాల్‌ను వేరే కేసులో అరెస్టు చేస్తే మహేంద్ర హత్యలో అతడున్నట్లు ఒప్పుకున్నాడు. నీసెల్‌కు అతడితో మాట్లాడించాం. నీవు తెలివిగా తెలీదన్నట్లుగానే ఫోన్ కట్ చేశావు. తరువాత నీవు వేరే నెంబరునుంచి మాట్లాడావు. ముందే ఊహించి ట్రయిన్ శబ్దం ఏర్పాటుచేశాం. నువ్వు నమ్మేసావు. ఇప్పుడే సంథాల్ పేరిట ఎకౌంట్ ఓపెన్ చేశాం. పట్టులో పిట్టలా దొరికిపోయావు" చెప్పాడు ఇన్‌స్పెక్టర్.

ఆమాటలకు అయోమయంలో పడ్డాడు రజనీకాంత్. చువ్వలవెనుక ఉన్న సంథాల్ సన్నగా నవ్వుతూ "మూడేళ్లక్రితం చేసిన హత్య ఇలా మెడకు చుట్టుకుంటుందని ఊహించలేదు బాస్" అన్నాడు.

★

సీరియల్



జరిగిన కథ :

మూలిక ఎక్కడ లభిస్తుందో చెప్పమని స్వామీజీని అడుగుతుంది బికాస్ అక్క. స్వామీజీకి భుక్తాయాసంతో వచ్చిన నిద్ర మత్తు కాస్తా ఆ ఒక్క మాటతో వదులుతుంది. వెంటనే గడ్డం నిమురుకుంటూ దాన్ని నిష్ఠాగరిష్ఠులైన తాము మాత్రమే చేయగలమంటాడు. పైగా బంగారాన్ని భస్మంచేసి...అందులో తనిచ్చే మూలిక రసం కలిపి బాగా రుబ్బి చందనం తయారుచేసుకొని ...ఆరాక... పాలల్లోనో, మజ్జిగలోనో కలిపి తాగాలంటాడు. బంగారం ప్రస్తావన రావడంతో ఆమె ఒక్కసారిగా కంపించిపోతుంది. తన పేదరికాన్ని ప్రస్తావిస్తుంది. ఇక లాభం లేదనుకొని మూడు పూటలా నోట్లో వేసుకోమని కొన్ని మూలికలు ఇస్తాడు. తన ఆరోగ్యం పట్ల అక్క చూపుతున్న శ్రద్ధ చూసి కరిగిపోతాడు బికాస్. ఈలోగా గనిలో పనిచేసే కార్మికులు కొందరు వస్తారు. బికాస్ తిరిగి రావాలన్ని కోరతారు...ఆ తర్వాత...

తమిళ మూలం : **కె. చిన్నప్పభారతి**

అనువాదం : **వి. వెంకటేశ్వర**

(పదిహేనవ భాగం)

బికాస్ జవాబు కార్మికులకు దిగ్భ్రాంతి కలిగించింది. కార్మికులు ఏకం కావాలి అన్న ఆలోచనకు బీజం నాటింది అతడే! కార్మికులకు న్యాయం చేకూరాలన్న ఆశయంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించింది అతడే! మరి ఎందుకు ఇప్పుడిలా మాట్లాడుతున్నాడు! తిన్న తన్నులూ అనుభవించిన వేదన చాలనుకొన్నాడా! వీళ్ళను నమ్మి ఏ పనీ చేయలేమని భావిస్తున్నాడా. ఉద్యోగంలో చేరితే మళ్ళీ పోరుబాట పట్టాల్సి ఉంటుందని జంకుతున్నాడా? అనేక సందేహాల తర్వాత వాళ్ళ ముఖాలు వాడిపోయాయి.

బికాస్‌తో బాటు తీవ్రంగా గాయపడి ఉద్యోగం కోల్పోయిన దిలీప్ అతడికేసి తేరిపార చూశాడు. దీపం వెలుగులో అతడి శుష్క నేత్రాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మూసి ఉంచిన అన్నం గిన్నెను తెరుస్తున్నప్పుడు ఆవిరి బుస్సుమని, అన్నం అటూ ఇటూ చిందినట్టు అతడి మనసులో కుతకుతలాడుతోన్న క్రోధం కట్టలు తెంచుకొంది.

"మూగవాళ్ళలా, బానిసల్లా పడి ఉండిన కార్మికులకు చైతన్యం కలిగించిన వాడివి నువ్వే. తిరుగుబాటులో పాలు పంచుకోకుండా కార్మికులు గనిలో పనిచేసుకుపోమంటే, మాలాంటి వాళ్లను కూడదీసుకొని న్యాయస్థానంలో దావాలేసిందీ నువ్వే. ఏమీ తెలియని మేము అమాయకంగా నిన్ననుసరించాం. దానికి అర్థం లేదా?" అని నిలదీశాడు.

వాళ్ళ ఆంతర్యం గ్రహించడం కోసం తాను వెలిబుచ్చిన అభిప్రాయం వాళ్ళను ఇంతగా గాయపరుస్తుందని అతడు అనుకోలేదు. ఉద్వేగభరితుడయ్యాడు. మాట పెగల్లేదు. తనను క్షమించమన్నట్టు వినయంగా అందరికేసీ చూశాడు. వెయ్యి మాటలు వ్యక్తం చేయలేని భావం ఆ చూపులో తొణికిసలాడింది.

"నాకు మీ సాహచర్యం కాకుండా వేరే మార్గం ఏముంది!" అన్నాడు.

వాళ్ళు అతడి భావాల్ని గ్రహించారు. మాటల్లో చెప్పనలవిగాని సంతోషం.

కాసేపు నిశ్శబ్దం రాజ్యమేలింది. తర్వాత నెమ్మదిగా అతడన్నాడు. మన పేదరికం తలగిపోవాలంటే మనకు సంఘం కావాలి.

అతడి మాటలు వాళ్ళ కర్ణపుటాల్లో శ్రావ్యంగా వినిపించాయి.

❑ ❑ ❑

నేలంతా చీకటి ఆవరించింది. వెలుతురులో చీకటి ముద్దల్లా కనిపించిన చెట్టుచేమలు, ఇప్పుడు చీకట్లో చీకటై కలిసిపోయాయి. చీకటి, సమస్తాన్ని తన హస్తగతం చేసుకొన్నట్టుగా ఉంది వాతావరణం.

కార్మికులు గనిలోంచి ఇంటిముఖం పట్టారు. చీకటి, వాళ్ళ జీవితాల్లోంచి విడదీయలేని ఓ భాగం. వాళ్ళ ఇళ్ళకూ, గనికి మధ్య మైళ్ళ దూరం. నేల అడుగున బొగ్గు నిల్వలు లేని ప్రాంతంలో వాళ్ళ నివాసం. కనుక వాళ్ళ నివాసం బాగా దూరంగా ఉండాల్సిన ఆవశ్యకత. వాళ్ళ తమ శ్రమనూ, అలుపునూ మరిచిపోవడం కోసం ఇల్లు చేరేదాకా ఏవో పాటలు పాడుకుంటూ ఉంటారు. ఆ పాటల్లో ప్రణయం, లజ్జ, అలక ఇలా ఎన్నో భావాలు! శాస్త్ర నియమాలు లేని స్వచ్ఛంద సంగీతం! కొన్ని సందర్భాల్లో ఎక్కువ పదజాలం కూడా లేకుండా "తాన తందనాన" వగైరా మాటలు గానీ, చిటికెలూ చప్పట్లు గానీ ఉంటాయి.

వాళ్ళ ఇళ్ళకు వెళ్ళే దారిలో సారాయి కొట్టుంది. ఆ దుకాణం దినదిన ప్రవర్ధమానం కావడం గని యజమాన్యానికి హర్షదాయకం. కార్మికులు తమ జీతం డబ్బులు తాగుడుకే వెచ్చించి కుటుంబ పోషణ కోసం అప్పుల పాలవడాన్ని వాళ్ళు మనసారా కోరుకుంటారు.

కొంతమంది కార్మికులకు సారాచుక్క గొంతులో దిగగానే ఎక్కడలేని జ్ఞానమూ అబ్బుతుంది. లోకం పోకడ గురించీ అనర్గళంగా ఉపన్యసించడం మొదలు పెడతారు. వాళ్ళు చెబుతున్నవన్నీ నిజం కాకపోవచ్చు. కానీ సత్యాసత్య విచక్షణకు అది సమయమూ కాదు. సందర్భమూ కాదు. అక్కడ

వెల్లడయ్యే రహస్యాలు అనేకమంది గౌరవ ప్రతిష్ఠలకు హాని కల్గించడం మాత్రం లాభం.

అది తమ శారీరక శ్రమనూ, మానసిక వేదననూ కొద్దిసేపు మరపింపజేసే భూతల స్వర్గం. యజమానులవో కార్మికులవో ఇలా అందరి జీవితాల గురించీ ఏ సంక్షోభమూ లేకుండా మాట్లాడుకొనే చర్చావేదిక.



పూరిపాకలో మట్టినేల మీద అస్తవ్యస్తంగా ఉన్న బెంచీల మీద కూచుని గుంపులు గుంపులుగా తాగుతున్నారు కార్మికులు. ఇంతలో ఒకడు లేచి "మామా! గాంధీగారి మరో అవతారంలా చెప్పుకొంటారు కదా మన రత్తయ్యను-వాడి కథ తెలుసా" అనడిగాడు. అతడి పక్కనున్న వాడు "ఒరేయ్ తాగుబోతు వెధవల్లారా! నేను మీలా తాగకుండా మిగిల్చిన డబ్బుతో ఓ గేదె కొన్నాను. పాల వ్యాపారం చేసి, ఆ డబ్బుతో పొలం కొంటాను. ఈ చెత్తపని వదిలేస్తాను" అంటాడే ఆ రత్తయ్య గురించా నువు చెప్పేది? అంటూ కథకు పూర్వభాగం కలిపాడు. గొంతులో ఉమ్మి చేరడంతో పుసుక్కున ఉమ్మాడు.

"వాడి గేదె నిన్న చచ్చిపోయింది. తెలుసా"?

" మనిషి చచ్చినా ఎవడూ పట్టించుకోవడం లేదు. ఇక గేదె చచ్చిపోవడం ఏమంత పెద్ద విషయం?"

"ఒరేయ్ పిచ్చి వెధవా! మనం నిన్న సారాకొట్టుకు రాకపోవడం మన అదృష్టం. ఆ దేవుడే మనల్ని కాపాడాడు"

ఇంతలో మరొకడు బెంచీ నుంచి లేచి, "దేవుడేం చేశాడు. మనం రోజూ అర్ధాకలితో చస్తున్నాం. ఆయనకు అదేం తెలీదా?" అని చెబుతూ తూలి పడ్డాడు.

"నిన్న అరిష్టం రోజు కదా! రత్తయ్య గేదెకు సుస్తీ చేసింది. అలాంటి రోజు జబ్బు బారిన పడితే మరణమే గతి. అలాగే జరిగింది. నిన్న మనం తాగి తందనాలాడుతూ, ఉంటే ఎక్కడో ఓ చోట గాయపడి టపా కట్టేసే వాళ్ళం. అలాంటి రోజుల్లో జాగ్రత్తగా ఉండాలి"

"ఒరేయ్ దొంగ నాయాల! నీకేం తెలుసు! పోయిన సంవత్సరం ఇదే రోజు, నక్కలోడు ఎవరింట్లోనో పిల్లిని పట్టాడు. అది కరిచి చచ్చాడు. వాడు ఈ చుట్టుపక్కల ఎన్ని పిల్లులు పట్టలేదు! పెద్దలు ఏవో లెక్కలు వేసి ఫలానా రోజు మంచిది. ఫలానా రోజు చెడ్డది. అని నిర్ణయించారు. దాన్ని అతిక్రమిస్తే మనకే నష్టం....ఇప్పుడు రత్తయ్యకు ఏం మిగిలింది? నెత్తినోరు బాదుకొంటున్నాడు... మనల్ని చూడు, కష్టం లేదు, రోగం లేదు.... తాగినప్పుడే మనిషి బుద్ధి శాఖోపశాఖలుగా విస్తరిస్తుంది. గని యజమాని నన్ను సంప్రదిస్తే లాభం గడించడానికి సలహాలిస్తా... మూర్ఖుడు, లాభం ఎలా గడించాలో తెలీకపోవడం వల్ల మన జీతం దొంగిలిస్తున్నాడు..." అన్నాడు మొదటివాడు.

ఖాకీ దుస్తులు ధరించిన మరొకడు "సావిత్రి తెలుసా?" అని అడిగాడు.

అతడి పక్కనే ఊరగాయ చప్పరిస్తూ కూచున్న ఒంటి ఊపిరిగాడొకడు "బండిలోకి బొగ్గు చేరవేసే పాశ్వాన్ కూతురా?" అడిగాడు.

"అవును. ఆమె దగ్గర జాగ్రత్తగా లేకుంటే దేహశుద్ధి కలుగుతుంది"

"ఏమిటి సంగతి?"

"ఆమె మొగుడ్ని వదిలి వచ్చేసింది. తండ్రి పైరవీ చేసి, ఉద్యోగం వేయించాడు ఆమెకు. పని చేయకుండానే జీతం తీసుకొంటోంది."

" అదెలా, ఆ మర్మం నాక్కూడా కాస్త చెప్పవోయ్"

" నువు చీరకట్టుకొని రా, చెబుతా" అంటూ కొంటెగా నవ్వి" బోధ పడిందా?" అని అడిగాడు.

"సరే, అసలు సంగతి చెప్పు"

"ఆవిడ పనంతా తోటి కార్మికులే చేసి పెడుతున్నారు." అంటూ భ్రుకుటి పై కెత్తి, చేతులు వెనక్కు మడిచి వేళ్లతో నుదురు నొక్కుకున్నాడు.

" ఎందుకు?"

"తమ ఉద్యోగాలు కాపాడుకోవటానికి"

" నాకేమీ బోధపడలేదు. స్పష్టంగా చెప్పు."

"ఆవిడ కొనచూపుకూ, చిరునవ్వుకూ మేనేజరు డంగైపోయాడు."

"అది సరే కానీ, ఆవిడ పని తక్కిన వాళ్ళెందుకు చెయ్యాలి.!"

"తమ ఉద్యోగాలు దక్కించుకోవాలంటే అలా చేయక తప్పదు. లేకపోతే గని లాగానే వాళ్ల బతుకులు కూడా చీకటి మయం అయిపోతాయి"

కై పక్కిన కళ్ళను విశాలం చేస్తూ ఒకడన్నాడు 'రేయ్! నీకు మేనేజరు గురించి మాత్రమే తెలుసు. నాకు గని యజమాని భాగోతం కూడా తెలుసు"

తాము దారిద్ర్య భారాన్ని మోస్తున్నందువల్ల ఆ యాతన నుంచి ఉపశమనం పొందడం కోసమే తాగుతున్నామని ప్రపంచానికి చాటుతున్నట్టుగా ఉంటుంది వాళ్ళ ప్రవర్తన.

సొరకాయ బుర్ర లాంటి తలా, గారపళ్ళు కలిగిన మరొకడు "నక్కను తరమాలని బయలుదేరే కుక్క దూరం నుంచి సన్నగా ఊళ వినిపించగానే పలాయనం చిత్తగించినట్టు, యజమానిని చూడగానే ఉచ్చలు పోసుకొనే నువ్వా యజమాని గురించి చెప్పేది? మత్తెక్కినా అబద్ధాలు చెప్పకూడదురా నాయల!" అన్నాడు.

"సారాబుడ్డీ మీద ఒట్టేసి చెబుతున్నా. నేను చెప్పేదంతా నిజమే" అంటూ తట్ట అనుకొని పక్కనున్న వాడి తొడ మీద గట్టిగా తట్టాడు.

దెబ్బ తగిలిన వాడు మత్తులో జోగుతూ, "నీకు సరసం బాగా తెలిసనట్టుందే! నా పెళ్ళాం అచ్చం ఇలాగే ముద్దు పెడుతుంది" అన్నాడు.

"దెబ్బకూ ముద్దుకూ తేడా తెలియకుండా వాగుతున్నాడు. ఎవడైనా వీడి కొంపలో దూరితే అడ్డంగా ఉన్నాడని వీడి పెళ్ళాం ఇలాగే ముద్దు పెడుతుంది కాబోలు" అని ఒకడు వ్యాఖ్యానించే సరికి, అందరూ గొల్లున నవ్వారు.

సొరకాయ బుర్ర తలకాయవాడు వణకుతున్న చేతులతో తల వెంట్రుకలు సవరించుకొని "ఎద్దుమొహం వెధవా! యజమాని భాగోతం తెలుసనని మూగనోము పాటిస్తున్నావు. అబద్ధం ఎప్పుడూ రక్తికట్టదని తెలుసుకో" అన్నాడు రెచ్చగొట్టే ధోరణిలో.

యజమాని గురించి ఏదో చెప్పదలచినట్టూ అయితే అది సమయానికి గుర్తు రాకపోవడంతో దీర్ఘాలోచనలో పడ్డట్టూ నటించాడు. ఎద్దు మొహంవాడు తెల్లగా ఉబ్బిన మొహంతో చుట్టూ వేటకుక్కలా పరికించాడు. తార్వత గొంతు విప్పాడు.

(ఇంకావుంది)

సుజలం!

- డా॥ విప్లవ్ దత్ శుక్లా



ఎడారుల్లో పెట్రోలే కాదు
కృత్రిమ ఒయాసిస్సులు మొలుస్తున్నాయి
కాని, నదులు ప్రవహించే దేశంలో
బతుకులే ఎడారులౌతున్నాయి
పుడమి గుండెలు పగిలి
నోర్లు తెరుచుకొన్న బీళ్లు
రైతు చర్మాన్ని పోలి
జీవిత మర్మాన్ని సూచిస్తున్నాయి
నీరు జీవనానికి ఉనికి
ప్రవహించే నీరు సంస్కృతికి ఉనికి
కాని, జీవన సంస్కృతి మారింది
వాడిపోయిన కళ్ళు
ఎండిన ఆకులు
"చెట్టూ–మనిషి"
ఆంశిక మరణమే ఇప్పుడు జీవనం!
చెరువులు, వాగులు
పల్లెల వలె అదృశ్యం అవుతున్నాయి.
కారణం....
దారిద్ర్యరేఖ కిందకు నీరు చేరుకోవడమే
అడుగుల లెక్కన భూమి అడుగుకు వెళ్ళినా
నిండుకొన్న కుండలో అన్నం వైనం
ఇప్పుడు తిండి పెట్టే స్థితి కాదు
మంచి నీళ్ళు ఇచ్చే పరిస్థితి లేదు
పంచభూతాలు పెట్టెల్లో, బాటిల్స్‌లో
అమ్ముడు పోతున్నాయి.
అందుకే....
వాటర్‌టాంక్ వీధిలోకొస్తే
ప్రపంచ దేశాల యుద్ధం తలపిస్తుంది.
కుళాయిలు కన్నీరు కారుస్తున్నా
మౌనంగా నిలబడ్డ తల్లి
బాధను ఓర్చుకొంటున్నది
భోరున ఏడ్వలేని
బోరు పరిస్థితి అంతే...
కొత్త పోలీసుకు దొరికిన దొంగలా
దెబ్బలు తింటోంది....
ప్రపంచం ఇప్పుడు
మంచినీళ్ళ ఖాళీ కుండ..
ఉన్న కాస్త నీళ్ళలో
ఫ్లోరైడ్ నుండి సయనైడ్ దాకా
మనం కన్నీళ్ళతో పెదాలు తడుపుతూ
జలసంరక్షణకు గొంతు చించుకోవాలి
నీళ్ళను కన్న కూతురులా కాపాడుకోవాలి
ఇప్పుడు –మనిషి మనుగడకు నీటి బిందువును
పూజించాలి!

★

పరకాయ ప్రవేశం

- మాధవీ సనారా



పిల్లల బాల్యాల సరస్సులు
రెసిడెన్షియల్ పాఠశాలల
ఎండ తీవ్రతకు ఎండి
కనుమరుగవుతున్నాయి
అపార్ట్‌మెంట్ పెట్టెల దొంతర్ల మధ్య
ఆకాశం, మబ్బులు, చుక్కలు, చంద్రుడు
నల్లపూసలవుతున్నాయి.
పూర్వం ఇల్లెక్కితే..... సుదూరంలో
కూర్చున్న కొండలు కనువిందు చేసేవి
ఇప్పుడు ఊరునిండా
బహుళంతస్థులుండటంతో
కొండలన్నీ
వాటి వెనక్కి పోతున్నయ్
వేకువ జామున
అందర్నీ లేపే కోళ్ళేవీ?
ఊరికి దూరంగా జరిగి
మేతకీ... కోతకీ పరిమితమైపోయాయి
చెట్ల సంతల్లో
అమ్మే... కొనేవారి సందడిలా వుండే
పక్షుల కిలకిలా రావాలేవీ?
అవన్నీ ఇప్పుడు
గ్లోబలీకరణ కాయంలోకి
పరకాయ ప్రవేశం చేశాయి.

★

గుమ్మడికాయ దప్పళం



కావలసినవి

గుమ్మడికాయ -అరకిలో ముక్క
బెల్లం -100 గ్రాములు
ఉల్లిపాయలు -1, పచ్చిమిర్చి -6
టమాటోలు -2, ఎండుమిర్చి -4
పసుపు - చిటికెడు
జీలకర్ర - కొంచెం
ఆవాలు -కొంచెం, కారం -2 టీ స్పూన్లు
మినప్పప్పు -1 టీ స్పూను
కరివేపాకు - రెండు రెబ్బలు
ఉప్పు - చాలినంత, నూనె - 2 టేబుల్ స్పూన్లు
చింతపండు - 100 గ్రాములు

చేసే పద్ధతి

గుమ్మడికాయను ముక్కలుగా కోసుకోవాలి. బాండీలో నూనెవేసి ఉల్లిపాయలు, పచ్చిమిర్చి వేయించాలి. తర్వాత గుమ్మడి ముక్కలు, ఉప్పు, కారం, పసుపు కలిపి మగ్గనివ్వాలి. తరువాత చింతపండు పులుసు, బెల్లం, టమాటా ముక్కలు వేయాలి.

చివరగా వెల్లుల్లి, మినప్పప్పు, ఆవాలు, జీలకర్ర, కరివేపాకుతో పోపు పెట్టుకోవాలి.

బెండకాయ చట్నీ

కావలసినవి

బెండకాయలు - పది
ఎండుమిర్చి -6
నూనె -2 టేబుల్‌స్పూన్లు
మినప్పప్పు - 1 టేబుల్ స్పూను
చింతపండు - కొంచెం
అల్లం - కొంచెం
కరివేపాకు - కొంచెం

తయారుచేసే విధానం

ఎండుమిర్చి, మినప్పప్పు, వేయించుకున్నాక పక్కనపెట్టుకోవాలి. నూనెలో బెండకాయలు వేయించుకోవాలి. తరువాత వేయించిన వాటికి చింతపండు, అల్లం, ఉప్పు కలిపి మిక్సీలో వేసుకోవాలి. తరువాత పోపు వేసుకోవాలి. అంతే బెండకాయ చట్నీ రెడీ.



క్యాబేజీ వడ

కావలసినవి

క్యాబేజి - 1
మినప్పప్పు - అరకిలో
ఉల్లిపాయలు - 100 గ్రాముల
పచ్చిమిర్చి -4
నూనె-సరిపడా
జీలకర్ర-చిటికెడు

తయారుచేసే విధానం

మినప్పప్పు నానబెట్టి రుబ్బుకోవాలి. క్యాబేజీని సన్నగా తరిగి అందులో వేసి కలపాలి. పచ్చిమిర్చి ముద్దగా నూరుకోవాలి. దీన్ని కూడా పిండిలో కలపాలి. ఉప్పునూ కలపాలి. పొయ్యిమీద బాండీలో నూనె కాగాక గారెల్లా వేసుకుని బంగారురంగులోకి వేయించుకోవాలి. వేడిగా తింటే సూపర్‌గుంటాయి.

మూంగ్ పాయసం

కావలసినవి

పెసరపప్పు - 6 టేబుల్ స్పూన్లు
పాలు - 1 కప్పు
పంచదార - 25 గ్రాములు
జీడిపప్పు - 5
యాలకులు -2
నీళ్లు - 3 కప్పులు
నెయ్యి - 1 స్పూను
కిస్‌మిస్ - కొంచెం

తయారుచేసే పద్ధతి

పెసరపప్పుని గోధుమరంగు వచ్చేవరకూ నేతిలో వేయించి వేరుగా ఉంచుకోవాలి. పాత్రలో నీరుపోసి మరిగాక అందులో పెసరపప్పు వేయాలి. మెత్తగా ఉడికాక పంచదార వేసి కరిగాక పాలు పోసి మరగనివ్వాలి. తరువాత వేయించిన జీడిపప్పు, కిస్మిస్, యాలకులపొడి వేయాలి. అంతే మూంగ్ పాయసం రెడీ.

పపెట్ చేద్దామా...

ఫ్రెండ్స్... మీకు పప్పెట్ అంటే ఇష్టమేనా? అయినా పప్పెట్ అంటే ఎవరికి ఇష్టముండదు చెప్పండి? వాటిని వేళ్లకు తగిలించుకుని కదిలిస్తూ అవి మాట్లాడుతున్నట్టుగా మనమే మాట్లాడుతూ ఇంట్లోవాళ్లని నవ్విస్తూ... భలేగా వుంటుంది కదూ. మరైతే ఆ పప్పెట్ ఎలా చేయాలో తెలుసుకుందామా.

<u>కావలసిన వస్తువులు:</u>

వాడేసిన అగ్గి పెట్టెలు, రంగుల స్కెచ్ పెన్నులు, పేపర్ నాప్కిన్, చార్ట్ ముక్క, గమ్.

<u>ఎలా తయారు చేయాలంటే...</u>

అగ్గిపెట్టెలోని పై అట్టని తీసుకోండి. దానిలో చూపుడు వేలు పట్టేట్టుగా సరిచేసుకోండి. పేపర్ నాప్కిన్‌ని బొమ్మలో చూపినట్టుగా మడిచి అట్టపెట్టెకి గమ్‌తో అతికించాలి. చార్ట్ ముక్కని తల ఆకారంలో గుండ్రంగా కత్తిరించి అట్టపెట్టెకి పైభాగంలో అతికించి, దానికి కళ్లు, ముక్కు, నోరు ఇలా... అమ్మాయి బొమ్మకు ఏమేం కావాలో అన్నీ స్కెచ్ పెన్నుతో గీసుకుంటే సరి. అట్టముక్కపై జడల ఆకారంలో గీసుకుని నలుపు రంగు స్కెచ్ అద్దాలి. వీటిని కూడా తలకు రెండు వైపులా అతికించాలి.బొమ్మ రెడీ. ఇక దీనిని మీ వేలికి తగిలించుకుని ఆడించి అందరికీ చూపించడమే ఆలస్యం.

చేయగలరా?

పిడుగులూ... ఇక్కడ మీకు ఆరు అగ్గిపుల్లలు కనిపిస్తున్నాయ్ కదూ. వీటితో పాటు మరో అయిదు అగ్గిపుల్లల్ని తీసుకుని వాటితో తొమ్మిదిని చేయండి చూద్దాం.



ఈ పన్నెండు అగ్గిపుల్లల్తో రెండు ని చేయగలరా? ఈ పుల్లన్ని ఎలాగైనా కదిలించుకోవచ్చు.



ఎంతకీ తెలీడం లేదా! అయితే జవాబు చూసేయండి.



ఆ పదాలేంటో...

నేస్తాలూ!మీకు జంట పదాలు తెలుసా? అదేనర్రా... arts-crafts, time-tide లాంటివన్నమాట. పైన అలాంటివి 13 పదాలున్నాయి. అయితే మీరు రాయాల్సిన ప్రతి పదం కూడా నాలుగక్షరాలే ఉండాలి. చివరిగా మా జవాబుతో సరిపోల్చుకోండే.

ఏమై వుంటుందో...

పిల్లలూ... కింద మీకు కొన్ని అక్షరాలు కనిపిస్తున్నాయిగా. ఆ అక్షరాలతో ఒక పదం రాయాలి. అవసరమైతే ఒక్కో అక్షరాన్ని రెండుసార్లు కూడా ఉపయోగించొచ్చు. మరి రాసేయండీ...



బాలనేస్తాలు



ఏది పెద్దది?

హాయ్ ఫ్రెండ్స్... ఈ రెండు బ్రిడ్జిలను బాగా పరిశీలనగా చూడండి. చూసేశారా! అయితే రెండింటిలో ఏది పొడవైనదో చెప్పండి.

కనిపెడదాం

హాయ్ పిడుగులూ! ఇక్కడ రకరకాల బ్యాగులు, బుట్టలు, బాక్సులు వున్నాయి. వాటి పేర్లు కూడా పక్కనే ఉన్న అక్షర సమూహంలో ఉన్నాయి. ఇప్పుడు మీరేం చేస్తారంటే వాటి పేర్లను ఆ బాక్సులో ఎక్కడున్నాయో కనిపెట్టి సున్నా చుట్టాలంతే!



X	B	R	E	B	A	G	Q	U	S	U
S	R	E	S	I	L	A	V	R	A	N
K	I	T	B	A	G	B	U	E	C	K
N	E	O	L	R	E	G	T	T	K	C
A	F	W	E	L	S	N	H	I	B	A
P	C	X	H	O	A	I	O	C	A	S
S	A	T	C	M	C	P	L	U	S	R
A	S	I	T	I	T	E	D	L	K	E
C	E	R	A	S	I	E	A	E	E	V
K	O	U	S	T	U	L	L	A	T	A
P	U	R	S	E	S	S	L	B	O	H



తప్పలెక్కడ?

నేస్తాలూ... పైన మూడు బొమ్మలున్నాయి చూశారా. మూడు బొమ్మలకు ఏమాత్రం సంబంధం లేదుగానీ... ప్రతి బొమ్మలో ఒక తప్పు ఉంది. అదేంటో చిటికెలో కనిపెట్టగలరా?

పొడుపు కథలు

1 అరిచేతంత కొయ్యకు అరవై వాకిండ్లు ఏంటో అది?

2. అక్కడక్కడి బండి, అంతరాల బండి: మద్దూరి సంతలోన మాయమైన బండి. ఏమై వుంటుందబ్బా...

3. అడవిలో పెట్టని దీపం, వెలుగు నిచ్చు అంతా. ఏది?

జవాబులు

తప్పలెక్కడ?:
1.పెద్ద మనిషి కోటుకు ఒక వైపు ఉండాల్సిన గుండీలు మరొక వైపు ఉన్నాయి. 2. కోడి పిల్లకి బాతు ముక్కు 3.పిల్లవాడు కుడి చేత్తో రాస్తే, అద్దంలోని ప్రతిబింబం కూడా కుడిచేత్తోనే రాస్తోంది.

ఆ పదాలేంటో... : arts-crafts, time-tide, fair-square,past-present, cats-dogs, spit- polish, good-bad, pots-pans, warp-weft,pins-needles, boys-girls, come-go, rave-rant.

చేయగలరా?: OML2 EININ1

ఏది పెద్దది?:
రెండు బ్రిడ్జిలు సమానమైన పొడవున్నాయి.

ఏమై వుంటుందో:
space suit

పొడుపు కథలు..:
1. దువ్వెన 2. సూర్యుడు 3.వెన్నెల

అట్టమీది కథ

యాగాల యాగీ వర్షాల బోగీ?

-టి. రమేష్

"వానల్లు కురవాలి వాన దేవుడా! పంటల్లు పండాలి వాన దేవుడా!" అంటూ ముఖ్యమంత్రి వాన దేవుడిని ప్రార్థించాడని మనం వార్తలు చూశాం. చదివాం. అంతేకాదు రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో, చర్చిల్లో, మసీదుల్లో ప్రార్థనలు చేయాలని ఆయా పూజరులను కోరడమే కాకుండా ఆయా శాఖాధిపతులకు ఆదేశాలు కూడా ఇచ్చాడు. రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా! దున్న ఈనిందంటే గుంజకు కట్టేయమనే అధికార గణం ఆగమేఘాలపై కదలి రాజావారి ఆదేశాలు తుచ తప్పకుండా అమలు చేశారు. పాతకాలం పెద్దలకు ఏనాడో వచ్చిన 'మంత్రాలకు చింతకాయలు రాలుతాయా!' అనే చిన్న సందేహం కూడా వీరికి రాకపోవడం యాధృచ్ఛికమా? లేక రాజ్యాంగ విరుద్ధమైనా ఏలినవారి దయ ఉండాలంటే వారి ఆదేశాలను అమలు చేయాలనే తాపత్రయమా?

దేవాదాయశాఖ వెంటనే స్పందించి వరుణ యాగాలు చేయాలని అన్ని గుడులకు ఆదేశాలు ఇచ్చింది. మైనారిటీ సంక్షేమశాఖ తన పరిధిలోని ఈద్గాలు, మసీదులలో ఏర్పాట్లు చేసింది. చర్చిలలో ప్రార్థనలకు అన్ని ఏర్పాట్లు చేసింది. తిరుమల తిరుపతి దేవస్థానం తన ఆధ్వర్యంలోని అన్ని గుడుల్లో వరుణ యాగాలు జరిపింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గుడుల్లో ఈ యాగాలు, పూజలు జరిగాయి. హైదరాబాద్‌లోని మీర్ ఆలం ఈద్గాలో వేలాది మంది ముస్లింలు చేరి ప్రార్థనలు జరిపారు. రాష్ట్రమంతటా చర్చిలలో ప్రార్థనలు జరిపారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జూలై 2నుండి 4 వరకు 108 హోమగుండాలతో 216 మంది పూజారులతో వరుణ యాగం జరిపించారు. ఈ యాగం ప్రారంభానికి, ముగింపుకి ముఖ్యమంత్రి స్వయంగా హాజరయ్యారు.

యాగాలు సరే వానలేవీ?!

అయినా నేటికీ వానలు సరిగా కురవడం లేదు. రాష్ట్రంలోని 23 జిల్లాల్లో 12 జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితి ఉన్నది. ఐదు జిల్లాల్లో వర్షాలు సాధారణ వర్షపాతంకంటే తక్కువ స్థాయిలో పడుతున్నాయి. రుతుపవనాల జాడే కనపడడం లేదు.

"చంద్రబాబు హయాంలో వానలు కురవలేదు. మేము రాగానే వానలు కురుస్తున్నాయి. చూశారా మా గొప్పతనం. దేవుడు కూడా మా పార్టీలో చేరాడు. మాది దేవుని పాలన" అని చెప్పుకునే వారు వర్షాల కోసం ఇప్పుడు ఇంతగా ఎందుకు అల్లాడుతున్నారు?! తమ వైఫల్యాలను కప్పి పుచ్చుకుని దేవునిపై భారం వేయడానికి జరుగుతున్న తంతా ఇది? అని ఎవరికైనా అనుమానం వస్తే అది వారి తప్పు కాకపోవచ్చు.

"యాగాలు, పూజలు చేయడం విశ్వాసానికి సంబంధించినది. దీనిని ఎందుకు తప్పుపట్టాలి?" అనే ప్రశ్న సహజంగా వస్తుంది. ఎవరి వ్యక్తిగత విశ్వాసాలు వారికి ఉండవచ్చు. ఎవరి విశ్వాసాలు వారివి. కాని రాజ్యాంగం ప్రకారం పరిపాలిస్తానని ప్రమాణం చేసి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వ అధినేత, రాజ్యాంగాన్ని కాపాడాల్సిన అధికారులు తమ బాధ్యతను మరచిపోయి రాజ్యాంగ వ్యతిరేక పనులు చేయడాన్ని ప్రతి ఒక్కరు ప్రశ్నించవచ్చు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఎ(హెచ్) చాలా స్పష్టంగా శాస్త్రీయ దృక్పథాన్ని, మానవత్వాన్ని,

శాస్త్రీయ పరిశీలనాదృష్టిని పెంపొందించడం ప్రతి పౌరుని ప్రాథమిక బాధ్యతగా చెప్పింది. ఈ అధికరణాన్ని మన పాలకులు ఏనాడో మరచిపోయారు. ప్రజలను తెలియని తనంలో ఉంచి తమ ప్రయోజనాలను సాధించుకోవడానికి ఇలాంటి అశాస్త్రీయ, రాజ్యాంగ వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

అనేక గ్రామాల్లో ప్రజలు తెలియని తనంతో కప్పల పెళ్ళిళ్ళ చేస్తే వానలు కురుస్తాయని, చెరువుల్లో పూజలు చేస్తే వానలు కురుస్తాయని రకరకాల విశ్వాసాలతో అనేక రకాలు పూజలు చేస్తారు. కాని వాటివల్ల ఏనాడూ వానలు కురిసిన దాఖలాలు లేవు. అలా కురిస్తే వర్షాభావ పరిస్థితులు అనేవే ఉండవు కదా! ఈ రకమైన పూజలు చేయని సంవత్సరం ఉంటుందా? అయినా కరువు ఎందుకు వస్తున్నది? వర్షాభావ పరిస్థితులు ఎందుకు వస్తున్నాయి? ఈ సందేహాలు ముఖ్యమంత్రికి రాలేదు మరి.

ఎందుకో ఏమిటో ఆలోచించారా?

ఒకే రాష్ట్రంలో ఒక దగ్గర ఎక్కువ వర్షపాతం, మరొక దగ్గర తక్కువ వర్షపాతం కురవడానికి కారణాలు ఏమిటి? ప్రతి సంవత్సరం జూన్ నెలలో రావలసిన రుతుపవనాలు ఈ సంవత్సరం ఇంకా ఎందుకు చురుకుగా రావడం లేదు? రుతుపవనాల కాలంలో వానలు అడపాదడపా ఎందుకు పడుతున్నాయి? వర్షాభావ పరిస్థితులకు కారణలేమిటి? వంటి అంశాలను పరిశీలించి కారణాలను తెలుసుకుని ప్రభుత్వం వాటిని పరిష్కరిస్తుందని ఎవరైనా ఆశిస్తారు. కాని ప్రభుత్వం వాటిని పట్టించుకోకుండా, వాటి గురించి ఆలోచించకుండా "వరుణ యాగాలు చేయండి. జపాలు చేయండి. పూజలు చేయండి. వానలు పడతాయి" అని చెప్పడం ప్రజలకు ఏ సంకేతాలు ఇవ్వదలచుకుందో కాస్త ఆలోచిస్తే అర్థమవుతుంది.

జూన్ 25 నుండి జూలై 1 వరకు ఒక వారం రోజులను పరిశీలిస్తే జిల్లాల వారీగా వానలు కురిసిన వివరాలు ఈవిధంగా ఉన్నాయి. ఆదిలాబాద్, చిత్తూరు, కడప, శ్రీకాకుళంలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం కురిసింది. తూర్పుగోదావరి, కరీంనగర్, నెల్లూరు, నిజామాబాద్, వరంగల్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం కురిసింది. అనంతపురం, గుంటూరు, హైదరాబాద్, ఖమ్మం, కృష్ణా, కర్నూల్, మహబూబ్‌నగర్, మెదక్, నల్గొండ, ప్రకాశం, రంగారెడ్డి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో అత్యంత తక్కువ వర్షపాతం నమోదైంది. సగానికి పైగా(12) జిల్లాల్లో అత్యంత తక్కువ వర్షపాతం కురిసింది. ఒక నాలుగు జిల్లాల్లో మాత్రమే వర్షపాతం సాధారణ స్థాయిని దాటింది. ఆ తరువాత ఇప్పటివరకు చూసినా వీటిలో పెద్ద మార్పులేదు. ఒక శాస్త్రిగారు "యాగాలు చేయగానే కుండలతో కుమ్మరించినట్లుగా వానలు పడతాయి చూసుకోండి" అని టీవీల్లో సవాళ్లు చేశాడు. యాగాలకు సైన్స్‌కు ముడిపెట్టే ప్రయత్నం చేశారు. మరి టి.టి.డి. వారు పెద్ద ఎత్తున 108 హోమగుండాలతో 216 రుత్విక్కులతో జూలై2 నుండి 4వరకు వరుణ యాగం, సహస్రఘటాభిషేకాలు జరిపినా కుండపోత వానలు ఎక్కడకు పోయినట్లో తెలియడం లేదు. ఉట్టి పుణ్యానికి ట్యాంకులకొద్ది నీళ్ల మురికి కాల్వల పాలయ్యాయి.

ఈ ప్రశ్న అడిగితే "మేఘమధనం చేసినా వానలు కురవడం లేదు కదా! మీ సైన్స్ ఫెయిల్ అయినట్లే కదా?" అని అతితెలివి ప్రశ్నలు వేస్తున్నారు. సైన్స్ ఎప్పుడూ కూడా ప్రకృతికి విరుద్ధంగా మేఘమధనం ద్వారా వానలు పడతాయని చెప్పలేదు. ప్రపంచంలో ఎక్కడా ఈ విధంగా కృత్రిమ వర్షాలు కురవలేదు. వానలు పడే చోట వాటిస్థాయిని 10-15 శాతం పెంచడం మాత్రమే సాధ్యమని చెపుతున్నారు. అది కూడా ఉష్ణవాహకమేఘాలపై ప్రయోగం ద్వారా మత్రమే సాధ్యమవుతుంది. శీతల మేఘాలను మధించే సాంకేతిక నైపుణ్యం ఇంకా అందుబాటులోకి రాలేదు. సైన్స్ తనకున్న పరిమితులను గుర్తిస్తుంది. నమ్రతగా ఒప్పుకుంటుంది. మరి ఇన్ని విషయాలు తెలిసికూడా ప్రభుత్వం ఎందుకు మేఘమధనం కోసం కోట్ల రూపాయలను ఖర్చు పెడుతున్నది? ప్రజలను భ్రమలకు గురి చేస్తున్నది? అనేది అందరికి తెలిసిన బహిరంగ రహస్యమే.

ఎక్కువ తక్కువలెందుకు?

వానలు కొన్ని సంవత్సరాలు కురిసి, కొన్ని సంవత్సరాలు కురవకపోవడానికి కారణలేమిటో శాస్త్రీయంగా తెలుసుకోవడం ప్రభుత్వ బాధ్యత. వాతావరణ మార్పులు అకాలవానలకు, వర్షాభావ పరిస్థితులకు కారణమవుతున్నాయి. ఎల్‌నినో పరిస్థితుల గురించి నిపుణులు వరుసగా 10సంవత్సరాలను అధ్యయనం చేయగా అందులో మన రాష్ట్రానికి సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. నాలుగైదు సంవత్సరాలు సాధారణ స్థాయికంటే ఎక్కువ వర్షాలు కురవగా, ఐదారు సంవత్సరాలు సాధారణం కంటే తక్కువ వానలు కురిశాయి. ప్రాంతాలు, జిల్లాల వారీగా చూస్తే తెలంగాణలో మూడు జిల్లాల్లో వరుసగా ఐదు సంవత్సరాలకు ఐదు సంవత్సరాలు సాధారణం కంటే అత్యంత తక్కువగా కురిశాయి. మిగిలిన ఆరు జిల్లాల్లో వరుసగా ఐదు సంవత్సరాలకు నాలుగు సంవత్సరాలు కూడా సాధారణం కంటే తక్కువగా కురిశాయి. ఒక్క సంవత్సరం మాత్రమే సాధారణం కంటే ఎక్కువ కురిశాయి. కోస్తా ఆంధ్రప్రదేశ్‌లోని రెండు జిల్లాల్లో వరుసగా తక్కువ వర్షాలు కురుస్తున్నాయి. రాయలసీమలోని మూడు జిల్లాల్లో తక్కువ వర్షపాతం నమోదవుతున్నది.



అధ్యయనం అవస్యం

ఐదారు సంవత్సరాలు సాధారణంగా వానలు పడుతుంటే మరో నాలుగైదు సంవత్సరాలు వానలు తక్కువగా కురుస్తున్నాయి. కొన్నిసార్లు కరువుకు కారణమవుతున్నాయి. వీటిలో ప్రాంతాలవారీగా, జిల్లాలవారీగా తేడాలు ఉన్నాయి. వీటికి వాతావరణంలో వస్తున్న మార్పులు కారణం. వీటినే ఎల్‌నినోలు అంటారు. ప్రభుత్వం ప్రజలపట్ల బాధ్యతగా వ్యవహరించదలచుకుంటే ఈ మార్పుల గురించి శాస్త్రీయ అధ్యయనం జరిపించాలి. కారణాలను గుర్తించాలి. సమస్యలను గుర్తించాలి. వాటి పరిష్కారాలకు తగిన

చర్యలు తీసుకోవాలి. కొన్ని మనం పరిష్కరించగలవి ఉంటాయి. కొన్ని మనం పరిష్కరించలేనివి ఉంటాయి. వేటిని ఏరకంగా ఎదుర్కోవాలో వ్యూహాలను, రూపొందించుకోవాలి. ప్రణాళికలను రచించుకోవాలి.

వనయాగాలు కావాలి

వానలు పడకపోవడానికి ప్రధాన కారణాలను అడిగితే చిన్న పిల్లవాడు కూడా ఈరోజు చెప్పగలడు. భూగోళం వేడెక్కడం. అడవులు తరిగిపోవడం. మన రాష్ట్రంలో పరిశీలించినా అడవులు ఉన్న శ్రీకాకుళం, ఆదిలాబాద్ జిల్లాల్లో మిగతా జిల్లాలకంటే మెరుగైన వర్షాలు కురవడం గమనించవచ్చు. కావున మనం చేయవలసింది. వరుణ యాగాలు కాదు. వన యాగాలు చేయాలి.

మొక్కలను పెద్ద ఎత్తున(కోట్లాదిగా) నాటాలి. చెట్లను పెంచాలి. అడవులను స్మగ్లర్లబారి నుండి కాపాడాలి. పెద్ద ఎత్తున స్థాపిస్తున్న పరిశ్రమలు వదులుతున్న కాలుష్యం మొత్తం వాతావరణాన్ని నాశనం చేస్తున్నాయి. ఆ పరిశ్రమలకు సామాజిక బాధ్యతను గుర్తింపచేసి అవి వదిలే కాలుష్యాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలి. ఆయా పరిశ్రమల స్థాయినిబట్టి వారు వీలైనన్ని ఎకరాల్లో అడవులను పెంచేలా చట్టాలను రూపొందించాలి.

పరిశ్రమలకు విచ్చలవిడిగా ప్రభుత్వ భూములను కేటాయించడాన్ని నియంత్రించాలి. ఎన్ని ఎకరాలను కేటాయిస్తున్నామో అంతే స్థాయిలో అడవుల పెంపకానికి కృషి చేయాలి. ఓపెన్‌కాస్ట్ మైనింగ్ జరిగే ప్రదేశాల్లో దుమ్ము, ధూళి వాతావరణంలో కలవడం ద్వారా వాతావరణ నష్టమే కాకుండా ప్రజలకు ఆరోగ్య



నష్టాలు కూడా కలుగుతున్నాయి. కావున ఆయా ప్రాంతాల్లో ప్రత్యేకంగా అడవుల పెంపకానికి కృషి చేయాలి.

సంరక్షణ చర్యలు తీసుకోవాలి

కొన్ని మనం నివారించలేనివి, మన చేతిలో లేనివి ఉంటాయి. ఉదాహరణకు ఎల్‌నినోలు. అవి ఎప్పుడు ఏర్పడతాయో శాస్త్రీయ అధ్యయనాల ద్వారా మనం తెలుసుకోగలం. ఆ విధమైన అధ్యయనాలను జరిపించాలి. ఇప్పటికే జరిగిన అధ్యయనాలను పరిశీలించాలి. వాటి ఆధారంగా రాబోయే వర్షాభావ పరిస్థితులను ముందుగానే గమనించి తగిన చర్యలు చేపట్టాలి. ప్రజలను హెచ్చరించాలి. వర్షాభావ కాలం కావున నీటి సంరక్షణకు తగిన చర్యలను తీసుకోవాలని ముందుగానే ప్రజలకు తెలియ చేయాలి. ప్రభుత్వం అలాంటి కాలాలను గమనించి ముందుగానే నీటి యాజమాన్య పద్ధతులను రూపొందించాలి. చెరువులను సంరక్షించాలి. కృష్ణదేవరాయలు, కాకతీయులు, నిజాంల కాలంలో తవ్విన చెరువుల శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. కొన్ని నాశనం అయినాయి కూడా. వాటిని పునరుద్ధరించాలి. చెరువులు, నీటివనరులలో, జలాశయాలలో నీటిని నిల్వ ఉంచుకుని అయా పరిస్థితులకు అనుగుణంగా వినియోగించుకునేలా చూడాలి.

వానలు పడడంలేదని అప్పటికప్పుడు హైరానా పడితే లాభంలేదు. దాహమేసినపుడు బావి తవ్వుకునే చందంగా కాకుండా ఒక ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలి. నిపుణులను, శాస్త్రవేత్తలను వినియోగించుకుని వర్షాభావ పరిస్థితులను తట్టుకోవడానికి ఏం చేయగలమో కార్యక్రమాలను రూపొందించాలి. వర్షాభావ పరిస్థితులను తట్టుకోగల వంగడాలను రైతులు వాడేలా చైతన్యపరచాలి.

సైన్స్‌తోనే పరిష్కారం

ఇప్పటి వరకు మానవుడు ఎదుర్కొన్న సమస్యలకు సైన్స్, శాస్త్రీయదృక్పథం ద్వారా మాత్రమే పరిష్కారం లభించింది తప్ప మరో మార్గం లేదు. జబ్బుపడిన వ్యక్తికి మందు ఇచ్చింది సైన్స్. రోగం రాకుండా నివారించడానికి వ్యాక్సిన్ ఇచ్చింది సైన్స్. ఆపరేషన్ చేసి ప్రాణాలను కాపాడగలుగుతున్నది సైన్స్. అనారోగ్యమే కాదు ఆర్థిక సమస్యలకు పరిష్కారాన్ని చూపెట్టింది సైన్స్. వస్తుమార్పిడి నుండి ఈనాటి రూపాయి, డాలర్ల వరకు సాధ్యమైంది సైన్స్ ద్వారానే. సతీసహగమనం, బాల్యవివాహాల వంటి అనేక సామాజిక సమస్యలకు పరిష్కారాన్ని చూపెట్టింది సైన్స్. సైన్స్ అంటే ఇక్కడ విజ్ఞాన శాస్త్రమే కాకుండా సైన్స్ ఎదగడానికి తోడ్పడిన సైన్స్ పద్ధతి మరియు శాస్త్రీయ దృక్పథం కూడా. వీటి ద్వారానే మనవుడి ప్రగతి సాధ్యమైంది. ఆదిమ కాలంలో చెట్టు తొర్రల్లో, కొండగుహల్లో తిరగాడిన మనిషి ఈనాడు అంతరిక్షంలో విహరించడం సైన్స్ ద్వారానే సాధ్యమైంది. అశాస్త్రీయ విధానాలు ఎప్పుడు కూడా మానవ ప్రగతికి ఆటంకంగానే ఉన్నాయి. వాటిని ఎదిరించి సైన్స్, మానవ ప్రగతి ముందుకే సాగుతున్నది. ఈ విషయాన్ని గమనించైనా మన పాలకులు తమ గుడ్డి నమ్మకాలను ప్రజలపై రుద్ది వారిని భ్రమల్లో ముంచే పనిని ఆపుతారనుకోవడం అత్యాశే అవుతుందేమో! అయినా మానవ ప్రగతి, సైన్స్ పురోగమనం ముందుకేగాని వెనకకు కాదు. ప్రజల చైతన్యమే పాలకుల భావాలను కూడా మారుస్తుంది. సత్యం జయిస్తుంది.

(రచయిత జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి)

★



కథ

అంతరం

ఇంతలో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. నేత చల్లగా సుమోలో జారుకున్నాడు. లారీ ఛార్జీలో గాయపడ్డ కార్యకర్తల్ని పోలీసులు ఈడ్చుకుంటూ వ్యాన్‌లో కుక్కుతున్నారు.

- బి.ఆర్.సి. మూర్తి

నేను గన్నవరం నుండి బుద్ధవరం వెళ్ళాల్సిన పనిబడ్డది. గూడురిక్షా కుదుర్చుకున్నాను. రిక్షా తాత లాగలేక లాగుతున్నాడు. నాకు జాలేసింది.

'పెద్దమనిషీ. ఇంత వయసొచ్చి రిక్షా తొక్కకపోతేనేం? కొడుకుల్లేరా?' అనడిగాను.

'చెట్టంత కొడుకున్నాడు. లాబంలే. బడ్డు సన్నాసి. అడపతడప నన్నే డబ్బులు అడుగుతాడు. నేను కష్టపడేది మా ఆడదాని కోసం. అది జబ్బు మనిషి' అన్నాడు చెమటను పంచెతో తుడ్చుకుంటూ.

ఏమిటో తల కొరివి పెట్టడానికి మగ నలుసు కావాలనుకుంటాం. వాళ్ళేమో పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులకు కాస్త తిండి పెట్టడానికి తెగబాధపడిపోతారు. ఆడపిల్లలే నయం. ఆపేక్ష పడ్తారు అనుకుంటుండగా తాత కలుగచేసుకుని...

'ఎప్పుడైనా బుద్ధిపుట్టి మావోడు పాతికో పరకో ఇవ్వబోతే కోడలు పిల్ల అడ్డుపుల్ల వేస్తుంది. ఈడికి ఎదురు చెప్పే ధైర్యంలేదు. బాబూ.. తమర్ని ఒకటి అడగనా... నా మేనల్లుడు కూడా నాయింట్లోనే పడి తింటడు. తమరేదైనా బతుకు తెరువుకి దారి చూపిస్తే నా చర్మం ఒలిచి మీ చెప్పులు కుట్తా' అన్నాడు.

'అంత మాటెందుకులేగాని! నా దగ్గరకు పంపించు. ఒకళ్ళకు సహాయపడితే పుణ్యమే కదా' అన్నా.

ఒకరోజు పాతిక ముప్పై ఏళ్ళ కుర్రాడు మా వాకిలి ముంగిలిలో నిలబడ్డాడు. 'రావోయ్ రా. మీ మామ అంతా చెప్పాడు. చూడు మిత్రమా! ఎవరి కాళ్ళ మీద వాళ్ళు నిలబడాలి' అన్నాను.

'ఎవరి కాళ్ళమీద వాళ్ళు కాకపోతే ఇంకొకళ్ళ కాళ్ళ మీద ఎట్టా నిలబడతాం స్వామీ' అన్నాడు.

'అంటే నా ఉద్దేశ్యం. స్వశక్తిని నమ్ముకోవాలి. తగిన ఉపాధి వెతుక్కోవాలి. వేలాది మంది నిరుద్యోగులున్నారు. అందరూ నీలా డీలా పడి ఇతరుల పంచన చేరుతున్నారా చెప్పు. నాలుగు వేలు పెట్టి నీకొక రిక్షా కొనిస్తాను. అది మా వరకే పరిమితం. అంటే... ప్రైవేటు క్యారియర్ అన్నమాట. బండిని మా రేకుల షెడ్డులో పెట్టుకో. నువ్వూ అందులోనే వుండవచ్చు. ఒక దిండు, క్యాంప్ కాట్ ఇస్తా. మాతోపాటే తిందువు కాని. మేం ఏం తింటే నీకూ అదే పెడతాం. కుటుంబ సభ్యుడిగా చూసుకుంటాం. బజారుకు, షాపింగుకి స్కూలుకు నన్నుగాని, మాఇంట్లో వాళ్ళనుగానీ తీసుకెళ్ళి తీసుకు రావడం నీ డ్యూటీ. ఖాళీవేళలో మా వసారాలో కూర్చుని టీవీ చూడొచ్చు. ఏడాదికి రెండు జతల గుడ్డలు పెడ్తా. నీకు బీడీ అలవాటుంటే బయటకు పోయి కాల్చుకో. ఏడాదికొకసారి మీ వాళ్ళను చూడాలనిపిస్తే రానుపోను చార్జీలిస్తా. చిల్లర ఖర్చులకు కాస్తో కూస్తో ప్యాకెట్ మనీ ఇస్తా. నా చేతికిస్తే కర్చు ఐ పోద్ది మీ వద్దే వుంచండి అంటే నీ పేర్న పోస్టాఫీసులో ఒక ఆర్డి ఖాతా తెరుస్తా. నేను ప్రతి నెలా వేసే డబ్బులు ప్లస్ వడ్డీ కలిపి ఒక పెద్ద మొత్తం నీ చేతికొస్తుంది. నీకు భవిష్యత్తులో అక్కరకొస్తుంది. ఆలోచించుకో' అన్నాను.

'ఆలోచించుకోవడానికి టైం ఇవ్వండి' అన్నాడు.

ఆ తర్వాత కన్పిస్తే ఒట్టు. ఒకరోజు వాళ్ళ మామ ప్రత్యక్షమైనాడు. 'అయ్యా తమరు మావోణ్ణి ఇంట్లో పెట్టుకుంటాం అన్నార్ట. చాయ్, చద్ది మెతుకులు పెడితే చాలా? గుడుంబా మాటేవిటి అంటున్నాడు. ఆడికి రేతిరి కాగానే నోట్లో కల్లు చుక్క పడాలి. ఎలక్షన్‌లో జండా పట్టుకుని తిరిగితే మస్తు బీరు, బిర్యాని. సిన్మాటిక్కెట్లు బ్లాకులో అమ్ముకుంటే మీరిస్తామన్నదానికంటే ఎక్కువే గిట్టుబాటు అవుతుంది. డూటీకి రాలేనని చెప్పమన్నాడు' అని చల్లగా చెప్పాడు.

నేను అవాక్కయ్యాను. మనిషి కనీస అవసరాలు కూడు, గుడ్డ, నీడ అనుకున్నా. ఐయాం వెరీమచ్ మిస్టేకెన్. పెళ్ళి పందిట్లో ఎంగిలి విస్తరాకులు కుక్కల ముందు పడేస్తే వాటిని వెళ్ళగొట్టి మనుషులు తింటున్నారు. ఆవురావురుమని క్షుద్బాధకు తాళలేక.

ఈ సంఘ సభ్యుడిగా నా వంతు సమాజ సేవ చేద్దాం అనే ఒక సంకల్పంతో ఒక తోటి ప్రాణికి సహాయం చేయాలను కోవడం తప్పా? ఇందులో నా స్వార్థం వుందా? నా ఊహకు అందటంలేదు. ఒకటి మాత్రం నిజం. మ్యాన్ ప్రపోజెస్, గాడ్ డిస్పోజెస్.

♦ ♦ ♦

ఎన్నికల సమరం షురూ అయ్యింది. టికెట్టు ఆశించి భంగపడిన వారు రెబెల్స్‌గా బరిలోకి దిగుతున్నారు. కొందరైతే పార్టీలో తమ ప్రాధాన్యం తగ్గిందని తమ సేవలకు తగిన గుర్తింపు లేదని వేరే పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారు. కొందరైతే స్వంతపార్టీ పెట్టుకుంటామని ప్రకటనలు ఇస్తున్నారు.

ఒకానొక పార్టీ ఆఫీసు బైట అసమ్మతివాదులు ధర్నా నిర్వహిస్తున్నారు. తమ నాయకుడికి అధిష్ఠానం మొండి చెయ్యి చూపించిందని ఒక దశలో పార్టీ కార్యకర్త ఒకరు ఒంటి మీద కిరోసిన్ పోసుకుని ఆత్మాహుతికి యత్నించాడు.

సెన్సేషన్ వార్తల కోసం అన్వేషించే ఒక టీవీ చానెల్ ఈ యావత్తు తతంగాన్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నది. టీవీలో నేను చూసిన దృశ్యం.

టిక్కెట్టు రాని ఒక ఛోటా నాయకుడి అనుచరగణం పార్టీ అధ్యక్షుడి దిష్టిబొమ్మను తగుల బెట్టున్నారు. నాయకుడే దగ్గరుండి పార్టీ ఆఫీసులోని ఫర్నీచరు ధ్వంసం చెయ్యమని అనుచరుల్ని పురమాయిస్తున్నాడు. ఇంతలో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. నేత చల్లగా సుమోలో జారుకున్నాడు. లారీ ఛార్జీలో గాయపడ్డ కార్యకర్తల్ని పోలీసులు ఈడ్చుకుంటూ వ్యాన్‌లో కుక్కుతున్నారు. అందులో గన్నవరం రిక్షాతాత మేనల్లుడు కూడా వున్నాడు. దుస్తులు చిరిగినయ్. ఒంటి మీద రక్తపు చారలు. నాకు పిటీ అన్పించింది.

మిస్‌గైడెడ్ యూత్!!!

★





ఎండినవే అయినా మెండైనవే!

నీరసంగా వుందా? అలసిపోయారా? డైటింగా? తక్షణ శక్తి అవసరమా? విటమిన్ 'ఎ' తో పాటు కాల్షియం కూడా అధికంగా కవాలా? తక్కువ తిన్నా ఎక్కువ పోషకాలు కావాలా? అయితే మీరు చేయవలసిందల్లా డ్రై ఫ్రూట్స్‌ని తినేయడమే?! అసలు పండ్లను ఎండబెట్టి తినే ప్రక్రియ ఎప్పటినుంచి ప్రారంభమైంది? వీటి వల్ల ఒనగూడే ప్రయోజనాలేంటి? వీటిని తినేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? వంటి వివరాలు ఈవారం మీకోసం ప్రత్యేకంగా...

- డా॥విజయ్

పండ్లనగానే తాజాగా, నవనవలాడుతూ ఉండాలని చూస్తాం. వీలైనంతవరకూ అటువంటివే తింటాం కూడా. తాజా పండ్లలో రుచితో పాటు పోషక పదార్ధాలు కూడా విరివిగా వుంటాయని, తద్వారా మన ఆరోగ్యానికి మంచి జరుగుతుందని మన అభిప్రాయం. అదంతా వాస్తవమే.

డ్రై ఫ్రూట్స్...

అయితే పండ్లని మరో రకంగా కూడా మనం తింటుంటాం - అదేనండీ...ఎండబెట్టి! డ్రై ఫ్రూట్స్‌గా పిలుచుకుంటూ ఎండు ద్రాక్ష (కిస్‌మిస్), అంజీర వంటి వాటిని వాడుతుంటాం. కానీ వాటిని నేరుగా కాకుండా ఇతర వంటకాల్లో/పదార్ధాల్లో కొద్దికొద్దిగా వాడతాం.

డ్రై ఫ్రూట్స్ అని అన్నా, ఎన్నో రకాల పండ్ల గింజలను కూడా ఎండబెట్టి, వాటి లోపలి పప్పులను కూడా వాడతాం. నిజానికి వాటిని డ్రై నట్స్ అనాలి. బాదం, పిస్తా, వేరుశనగ, జీడి వంటివి ఎన్నో ఈ కోవలోకి వస్తాయి. వీటిని మనం చాలా కొద్దిగానే వాడతామనుకోండి.

ఎండు పండ్లు మనకు బాగా తెలిసినవి ద్రాక్ష (నల్లనివి, పచ్చవి కూడా), పీచ్ పండ్లు, అంజీర, ఖర్జూర. కానీ ఆపిల్, చెర్రీ, స్ట్రాబెర్రీ, అరటి వంటి పళ్లెన్నో కూడా ఎండబెట్టి వాడే అలవాటుందని మనకు తెలియదు. కానీ అలా జరుగుతోంది. పూర్తి పండుని ఎండబెట్టడమే కాకుండా ఆయాపండ్ల గుజ్జు తీసి, పొరలు పొరలుగా ఎండబెట్టడం కూడా పరిపాటే. మనకు బాగా పరిచయమైన మామిడి, తాటి తాండ్ర అటువంటివే.

ఎప్పటినుంచో...

పురాతన కాలం నుండే ఆహార పదార్ధాలను నిలువ వుంచే పద్ధతులకోసం అన్వేషణ ఆరంభమైంది. ఇప్పుడైతే రేడియేషన్, కాన్నింగ్, ఫ్రీజింగ్ వంటి సదుపాయాలు వచ్చాయి కానీ గతంలో అవన్నీ వుండేవి కాదు. మనవాళ్లు కాలంకాని కాలంలో కూడా పండ్లను రుచి చూడటానికి "ఊర"బెట్టడం నేర్చుకున్నారు. దానికంటే ముందునుండే పండ్లని ఎండబెట్టడం ప్రారంభమైంది.



జీవ పదార్థాలలో నీరు అధికంగా వుంటుంది. దానివల్ల వాటిని తినే మనకు బాగానే లాభం చేకూరుతుంది. కానీ వాటికి మాత్రం సూక్ష్మజీవుల దాడి ప్రమాదం వుంది. పండ్లు 'కుళ్లి'పోవడం ఆ క్రమంలో భాగమే. ఒకవేళ ఆ నీటినే కనక తీసివేస్తే, పండు పాడవ్వదనే ఆలోచనే ఎండబెట్టడానికి దారి తీసింది.

క్రీస్తుపూర్వం 1490లో కూడా ఎండుద్రాక్ష ప్రస్తావన ఉంది. కానీ 1876లో విలియం థాంప్సన్ అనే స్కాటిష్ వ్యక్తి గింజలు లేని ద్రాక్షను అభివృద్ధి చేసిన తరువాత ఎండు ద్రాక్ష మరింత ప్రాచుర్యం పొందింది. వాస్తవానికి ఆ తరువాత ఒక పరిశ్రమే ఏర్పడింది.

లాభాలెన్నో...

పండ్లను ఎండబెట్టడం అనే ఈ ప్రాచీన ప్రక్రియ వల్ల ఎన్నో లాభాలున్నాయి. పండ్లు పాడైపోతాయనే భయం లేకుండా ఎంతకాలమైనా వాటిని నిలువ చేసుకోవచ్చు. పైగా నీరు కోల్పోవడం వల్ల బరువు తగ్గడమే కాకుండా ఒక కొత్త రుచి కూడా వస్తుంది. వీటికి తోడు అసలు పండులోని పోషకాలు - విటమిన్లు, ఖనిజాలు - తగ్గకుండా శరీరానికి అందుతాయి. ఒక రకంగా, తాజా పండ్లకంటే ఎండినవాటిని ఎక్కువ మోతాదులో తినగలం కాబట్టి ఇంకా ఎక్కువ పోషక పదార్థాలు లభించే అవకాశముంది. నిజానికి ఎండిన పండ్లు ఎక్కువ చక్కెర పదార్థాలు కలిగివుంటాయి కాబట్టి శక్తిని త్వరగా విడుదల చేస్తాయి. ఎండిన పండ్లలో వుండని విటమిన్లు 'డి, సి' మాత్రమే.

వీటిలో ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు (సహజ చక్కెర రూపంలో)తో పాటు పీచు పదార్థం కూడా పుష్కలంగా లభిస్తుంది.

విటమిన్ 'ఎ, బి1, బి2, బి6, పాంటోథెనిక్ ఆమ్లం' విరివిగా వుంటాయి.

కాల్షియం, మెగ్నీషియం, ఫాస్పరస్, పొటాషియం, సోడియం, కాపర్, మాంగనీస్ కూడా బాగా వుంటాయి.

దాదాపు 60 నుండి 70 శాతం సహజ చక్కెరలు సులభంగా జీర్ణమయ్యే రూపంలో (గ్లూకోజ్, ఫ్రక్టోజ్) వుండడం వలన అవి వెంటనే రక్తంలోకి వెళ్లి శక్తినిస్తాయి.

ఎండుపండ్లలో మరో లాభం ఏమిటంటే, వీటిలో అసలు కొవ్వు పదార్థాలు వుండకపోవడం!

అన్ని రకాల ఎండుపండ్లూ లాభదాయకమే అయినా, ఎండిన 'ప్లమ్'లు మాత్రం మరింత లాభం. వాటిలో 'యాంటీ ఆక్సిడెంట్లు' పుష్కలంగా వుంటాయి. ఆ పదార్థాల వలన క్యాన్సర్, హృద్రోగాలు, కాటరాక్ట్‌లు వంటి సమస్యలను నివారించవచ్చు.

తినేముందు కడగాలండోయ్

ఎండిన పండ్లతో ఎన్నో లాభాలున్నాయి మరి. కానీ వాటిని తినేముందు జాగ్రత్తగా కడగాలి. కొన్నిసార్లు ఎండబెట్టే ప్రక్రియలో సల్ఫర్ వంటివి వాడతారు. అవి కొందరికి పడక ఇబ్బంది కలిగిస్తాయి.

డ్రై ఫ్రూట్స్‌తో మరో సమస్య కూడా ఉందండోయ్. వీటిలో శక్తి ఎక్కువగా వుంటుందని చెప్పుకున్నాం కదా. ఒక కప్పు మామూలు ద్రాక్షలో 50 కాలరీలు, బోలెడంత నీరు వుంటే, అంతే మోతాదు ఎండు ద్రాక్షలో అంతకు పదిరెట్లు కాలరీలు ఉంటాయి. కాబట్టి బరువు తగ్గే ప్రయత్నాల్లో వున్నవాళ్లు వీటి వాడకం కాస్త జాగ్రత్తగా చేయాల్సి వుంటుంది.

ఎంత 'ఎండిన' పండ్లైనా మరీ గింజల్లా గట్టిగా అయిపోవు. వాటిలో కాస్త తేమ మిగిలే వుంటుంది. కాబట్టి సరైన జాగ్రత్తలు తీసుకోని పక్షంలో బూజు పట్టే అవకాశాలు ఎక్కువ. ఒకవేళ బూజుపడితే, అవి ఎంత ఖరీదైనవైనా, తినడానికి యోగ్యం కావు. బహుపరాక్!

★


విశ్వశాంతి స్థూపం

ఈ పేరు వినగానే ప్రాచీన యుగం గుర్తుకు వస్తుంది కదూ! ఈ ప్రాంతమంతా చూడాలని ఎవరికి మాత్రం వుండదు చెప్పండి. ఇది వైశాలి జిల్లా కేంద్రం. ఒక మాదిరి చిన్న టౌను. ఇక్కడి నుండి 22కిలోమీటర్ల దూరంలోని లాల్‌గంజి చేరి, మరో 10కిలోమీటర్లు ప్రయాణం చేస్తే వైశాలి చేరుకోవచ్చు.

వైశాలి విశేషాలివే...

రోడ్డుకు దగ్గరలోనే 85 ఎకరాల ప్రాంతం గుర్తించి చుట్టూ మళ్లీ తీగకంచె వేశారు. ఇది ఒకనాటి వైశాలి నగరంలో తవ్వకాలు జరిగిన భాగం. వైశాలి ఒకనాటి గణతంత్ర మహానగర రాజ్యం. ఈ నగర రాజ్యాల వ్యవస్థను, మనల్ని చూసి రోమన్లు అనుకరించారో లేక మనమనుకరించామో చెప్పడం కష్టం. ప్రాచీనకాలంలో రోమ్‌తో భారతదేశపు వాణిజ్యం విస్తారంగా వుండేది కనుక ఈ పరస్పరానుకరణ వివరాలు చరిత్రకారులకు వదిలేద్దాం.

దీని విశిష్టతకు మరో కారణం వుంది. అశోకుని సామ్రాజ్యం నేపాల్ లోయ వరకూ విస్తరించి వుండేది. ఆనాటి బీహారు నుంచి నేపాల్ వరకూ ఉన్న మార్గంలో మధ్యగా ఉండడం వల్ల వైశాలి గొప్ప కేంద్రంగా ప్రసిద్ధి పొందింది. ఇక బుద్ధుని కాలంలో ఇది అత్యంత వైభవంతో విలసిల్లిన నగరం. బుద్ధుడిక్కడ మూడు చాతుర్మాశ్యాలు నిర్వహించడమే కాక, ఎన్నో విశిష్టమైన బోధనలనిక్కడే ప్రవచించాడు. ఒకసారి ఆయనిక్కడకు విచ్చేసిన సమయంలో ఒక కోతులమంద ఆకుదొన్నెలో తేనె నింపి బుద్ధునికి సమర్పించాయట. ఇది బుద్ధుని జీవితకాలంలో జరిగిన 8 అద్భుత సంఘటనలలో ఒకటికగా భావిస్తారు. తన నిర్వాణ సమయం ఆసన్నమౌతుందని బుద్ధుడిక్కడే ప్రకటించాడు. ఈ వైశాలినుండే ఆ మహామహుడు కుశినగర్ చేరి నిర్వాణం పొందాడు. ఈ విధంగా ఐశ్వర్య వైభవంలో మాత్రమే కాక, బుద్ధుని జీవితంలోనూ వారి ప్రవచనాలతోనూ పెనవేసుకుని ఆధ్యాత్మిక మకరందాన్ని నింపుకున్న విశిష్టత ఈ వైశాలికి దక్కింది. అంతే కాదు, ఇది జైనులకు కూడా పవిత్ర క్షేత్రమే. వారి ఆఖరి తీర్థంకరుడు వర్ధమాన మహావీరుని జన్మస్థలమిది. దీనికి మరో ప్రాముఖ్యత వుంది. బుద్ధుని నిర్యాణం తరువాత 100 సంవత్సరాలకు తలెత్తిన వివాదాలను పరిష్కరించుకోవటానికి బౌద్ధ మతగురువులందరూ వైశాలిలోనే రెండవ సమావేశం జరిపారు (మొదటి సమావేశం రాజగిరిలో జరిగింది).

రాజా విశాల్ కా ఘర్

కంచె లోపల పెద్ద పెద్ద మట్టి దిబ్బలు, ఇటుకల గుట్టల ప్రాంతంలో తవ్వకాలు జరిగాయి. ఆనాటి నివాసగృహాలు భూమిలోనికి దిగిపోయి, చిన్న చిన్న గదులుగా దర్శనమిస్తాయి. దీనినే 'రాజా విశాల్ కా ఘర్' అంటారు. ఇది ఒకనాటి రాజప్రాసాదమే కాక నాటి పార్లమెంటు భవనం కూడా. నాడు ప్రభవించిన 16 నగర రాజ్యాలలో ఒకటైన వైశాలి నగరపు అధికార పీఠం. లిచ్ఛవుల కాలంలో వైశాలి గణతంత్ర రాజ్యంగా వినుతికెక్కింది. ప్రపంచమంతా రాజరికాల ఉక్కుపాదాల కింద నలుగుతున్న దశలో ఇక్కడ ప్రజాస్వామ్యం వికసించి, ప్రతినిధుల నెన్నుకుని, ఈ ప్రతినిధుల సభకు సార్వభౌమాధికారాలు కట్టబెట్టేవారు. ఎన్నికైన ప్రతినిధులు, ఇక్కడ పుష్కరిణిలో స్నానమాచరించి, ప్రమాణ స్వీకారం చేసి ధర్మబద్ధంగా తమ



విధులు నిర్వహించేవారు. వీరీ సభకు నిర్దేశించిన ప్రత్యేక నియమావళిని అనుసరిస్తూ క్రమశిక్షణతో, సమిష్టి బాధ్యతతో కూడిన సార్వభౌమాధికారంతో, ప్రజల స్వేచ్ఛ, ఆకాంక్షల కనుగుణంగా సర్వజనామోదంగా పరిపాలన కొనసాగించేవారు. వారి నిర్ణయాలే శాసనాలు. ప్రజలందరికీ శిరోధార్యాలు. ఇలా స్వేచ్ఛ, సౌభ్రాతృత్వాల మధురఫలాలను తనివితీరా అనుభవించి కృతార్థులైనారిక్కడి ప్రజలు. ఫలితంగా, ప్రశాంత జీవనంతో పాటు సిరిసంపదలతో తులతూగింది వైశాలి. ఇక్కడ లభించిన మట్టి ముద్రికలు ఆనాటి వాణిజ్య సంస్థలకూ, ప్రముఖ వ్యాపారులకూ, బ్యాంకులకూ చెందినవి. వారి వారి పేర్లతో వుండడం వల్ల ఇది ప్రముఖ వాణిజ్య కేంద్రమని అవగతమౌతుంది. ప్రభుత్వానికి సంబంధించిన ముద్రలు చూస్తే గుప్తుల కాలంలో పాలనావ్యవస్థలో వైశాలి ఒక ముఖ్య కేంద్రమని అవగతమౌతుంది. ఇవి వారి రాజ్య సరిహద్దునున్న నిఘా కేంద్రంగా కూడా ప్రసిద్ధిపొందింది. చైనా యాత్రికుడు యువాన్ చాంగ్ కథనం ప్రకారం 11/12 చదరపు మైళ్ల విస్తీర్ణంలో వెలసిన మహానగరం వైశాలి. ఇక్కడ వెలసిన ఆలయాలు, ఇతర కట్టడాలు లెక్కకు మించివున్నాయి. ఆనాటి నగరమంతా ఇప్పుడు ఆనవాలు కూడా లేకుండా భూగర్భంలో కలిసిపోయింది. మానవ జీవితానికే కాదు నగర సౌభాగ్యానికీ ఉద్ధాన పతనాలుంటాయి. ఇదే చరిత్రలో ఆసక్తి రేకెత్తించి, రసానుభూతినలమే పార్శ్వం.

వైశాలి మ్యూజియం

ఇక్కడి తవ్వకాల్లో లభించిన వస్తువుల్ని ఈ మ్యూజియంలో భద్రపరిచారు. ఎక్కువగా ఎర్రమట్టి బొమ్మలు, పాత్రలు, పళ్లేలు, మట్టిగంటలు. ఈ బొమ్మల్లో స్త్రీల చిత్ర విచిత్రమైన కేశాలంకరణ ముగ్ధుల్ని చేస్తుంది. దాదాపు మనకు తెలిసిన అన్ని జంతువుల బొమ్మలూ ఇక్కడ లభించాయి. ప్రాచీనతలో ఇవి మౌర్య, సంగమ, కుషాను, గుప్తుల కాలానికి చెందినవి. నల్లరాతి శిల్పాలూ, నల్లరాతి ద్వార తోరణాలు శిధిలాలుగా లభించాయి. దీనిని బట్టి ఆనాటి నగర వైభవం రేఖామాత్రంగానైనా ఊహించగలము. రాగి గిన్నెలు, గంటలు, జాతిరాళ్ళ పొదిగిన కంఠాభరణాలు, శంఖువులు, జంతువుల అస్థిపంజర శిధిలాలున్నాయి. సన్నని పొడవాటి రాగి కాడలున్నాయి. ఇవి బహుశా స్త్రీల అలంకరణకు (కాటుక, బొట్టులాంటివి) ఉపయోగించిన సాధనాలు కావచ్చు.

బలి సరస్సు

కొంత లోపలిగా ఒక సరస్సు ఉంది. వామనుడు బలి చక్రవర్తిని పాతాళానికి తొక్కినపుడు ఈ సరస్సు ఏర్పడిందని స్థానిక కథనం. ఇక్కడ లభించిన వస్తువులనొక చిన్న గదిలో భద్రపరిచారు. నల్లరాతితో రాతిమీద మలచిన తీరు అద్భుతంగా వుంటుంది. ఈ సరస్సు ఏర్పడిందని స్థానిక కథనం. ఇక్కడ లభించిన వస్తువులనొక చిన్న గదిలో భద్రపరిచారు. నల్లరాతితో మలచిన శివపార్వతులు, గణపతి, విష్ణువులాంటి విగ్రహాలున్నాయి. వీటికి దిద్దిన ఆభరణాలు, సన్నని రేఖలతో రాతిమీద మలచిన తీరు అద్భుతంగా వుంటుంది. నల్లరాతిలో మలచిన గృహాలంకరణలు శకలాలుగా లభించాయి. బహుశా ఈ మడుగులో ఒకప్పుడు రాజమందిరం గానీ, శిల్పకళా నిలయమైన ఆలయం కానీ ఉండి వుండవచ్చు.

జైన మందిరం

దీనికి పక్కనే జైనతీర్థంకరుడు, మహావీరుడు ప్రవచనాలు చేసిన వాటిక వుంది. వీరికొక ఆలయం నిర్మించి పాదుకలు ప్రతిష్ఠించారు. ఈ పాదుకలు మహావీరుని అసలు జన్మస్థానం "బసర్‌కుండ్" అనే గ్రామం. ఇక్కడకు 4 కిలోమీటర్ల దూరంలో ముజఫర్‌పూర్ వెళ్లేదారిలో వుంది. దీనినే జైనులు "కుండల్ పూర్" అంటారు. అయితే ఆనాటి వైశాలి నగరపు శిధిలాలు 19 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో వున్నాయి. కనుక ఈ గ్రామాలు ఆ నగరంలో భాగమే. అందుకే వైశాలి మహావీరుని జన్మస్థలంగా భావిస్తారు.

మంగళ పుష్కరిణి

రోడ్డుకు రెండవవైపు లోనికి వెళితే, చాలా పెద్ద సరస్సు వుంది. దీనినే మంగళ పుష్కరిణి అంటారు. అజాతశత్రువు మగధను పాలించిన కాలంలో, ఆయన ఆస్థానంలో "ఆమ్రపాలి"అనే రాజనర్తకి వుండేది.ఆమె అపురూప సౌందర్యవతి. మహారాజుకి ప్రియనర్తకి. ఆమెకున్న ప్రత్యేకస్థానం వలన మహారాజు ఈ సరస్సును ఆమె జలక్రీడలకు ప్రత్యేకించాడు. విరిసిన పద్మాలతో అందాలు వెదజల్లేదట ఆనాడు.

బౌద్ధ స్థూపం

ఈ సరస్సుకి కొద్ది దూరంలో స్థూప శిధిలాలున్నాయి. తవ్వకాలలో కొద్దిభాగం మాత్రమే వెలికి తీయగలిగారు. చుట్టూ రెండు అడుగుల ఎత్తున్న గోడ. మధ్యలో మట్టి దిబ్బ. ఇవి మాత్రమే మిగిలాయి. కానీ ఈ


జైన మందిరం


వైశాలి మ్యూజియం



మంగళ పుష్కరిణి



ప్రస్తుతం వైశాలిలో...

ప్రదేశం మహత్తర సన్నివేశాలకు వేదికగా నిలిచింది. ఇదే బుద్ధుడు చాతుర్మాశ్యాల కాలంలో నివసించిన ప్రదేశం. ఇక్కడే అమరపాలి తన భోగభాగ్యాలను పరిత్యజించి బౌద్ధం స్వీకరించిందట. బుద్ధుని నిర్యాణం తరువాత, వారి అస్థికలను ఎనిమిది భాగాలుగా చేసి ఏడుగురు రాజులు, ఒక బ్రాహ్మణుడు తీసుకున్నారు. వీరిలో వైశాలి పాలకులు ఒకరు. వారి భాగానికి దక్కిన బుద్ధుని అస్థికలను ఈ స్థూపంలో నిక్షిప్తం చేశారు. తవ్వకాలలో లభించిన ఈ అస్థికలనిప్పుడు ఢిల్లీ మ్యూజియంలో భద్రపరిచారు. దీనిపై ఇప్పుడొక షెడ్డు నిర్మించారు. వానకూ, గాలికీ ఇది మరింత శిథిలం కాకుండా ఈ షెడ్డు కాపాడుతుంది. చుట్టూ చక్కని ఉద్యానవనం కూడా వేశారు.

కలువా గ్రామం

వైశాలి నుండి నాలుగు కిలోమీటర్ల దూరంలో కలువా గ్రామముంది. ఇక్కడ అశోకుడు నెలకొల్పిన శిలాధ్వజం సింహమకుటంతో వుంది. దీనినిక్కడ భీమసేన్ కలాఠి అంటారు. ప్రస్తుతం భూతలానికి 22అడుగుల ఎత్తునుండి. ఇంకా చాలా భాగం భూమిలోనే ఉండిపోయిందన్నమాట. పైన గంటాకారంలో మలచిన మకుటంపైన సింహం కూర్చున్నట్లు మలచారు. అద్దం లాగున నునుపుచేసి ప్రతిష్ఠించారు. ఇక్కడి తవ్వకాలలో అశోకుని శాసనాలేవీ లభించలేదు. కానీ ఇదిమాత్రం యువాన్ చాంగ్ వర్ణించిన అశోకుని స్థంభమే. అశోకుడు రాజ్యాభిషిక్తుడైన 20 వ సంవత్సరంలో అప్పటికే ఆయన బౌద్ధాన్ని స్వీకరించాడు. పాటలీపుత్ర నుండి లుంబిని వరకు ధర్మయాత్ర చేసి దారిలో బుద్ధుని జీవితంతో ముడివడిన ప్రదేశాలన్నీ దర్శించి ఈ శిలాధ్వజాలతో శాసనాలతో వాటిని చిరస్మరణీయం చేశాడు. ఇక్కడ దక్షిణ దిశగానున్న సరస్సును రామకుండం అంటారు. ఇదే, కోతులు బుద్ధుని కొరకు నిర్మించిన కొలనుగా కన్నింగ్‌హామ్ అభిప్రాయపడ్డాడు. దీనికెదురుగా ఒక శిథిలమైన స్థూపముంది. ఈ ప్రదేశంలో బుద్ధుని ప్రియశిష్యుడైన ఆనందుడు నివశించాడట. ఇక్కడున్న అనేక చిన్న చిన్న స్థూపాలను మనౌవి స్థూపాలంటారు. ఇవన్నీ, భక్తులు తమ కోరికలు నెరవేరినందుకు కృతజ్ఞతతో నిర్మించినవని స్థానికులంటారు. కానీ స్థూపాలు అస్థికల మీద నిర్మిస్తారు. బహుశా ఇవి ఒకనాడిక్కడ నివసించిన భిక్షువులలో ప్రఖ్యాతులైన వారికి నిర్మించిన స్థూపాలు కావచ్చు. బుద్ధగయలో కూడా ఈ పద్ధతి కనిపిస్తుంది. ఇక్కడ కోతుల సరస్సుకు ఈశాన్యంగా ఒక శిథిలమైన స్థూపం ఉంది. భూతలానికి 15అడుగుల ఎత్తులో 65 అడుగుల పరిధిలో వుంది. ఇది యువాన్ చాంగ్ వర్ణించిన అశోకుడు నిర్మించిన స్థూపంగా గుర్తించారు. దీనిపైన చిన్న మందిరం ఇటీవల నిర్మించారు. లోపల మధ్యయుగాలనాటి బుద్ధ విగ్రహముంది.

ఇతర మందిరాలు

లిచ్ఛవుల తరువాతి కాలానికి చెందిన "భవన్ పోఖర్" మందిరం, హరికటోరా మందిరం, మీరాంజీ అనే ముస్లిం మహాత్ముని దర్గా ఇక్కడ చూడవలసిన పవిత్రస్థలాలు.

శాంతి స్థూపం

దీన్ని ఇటీవల జపాన్ వారు నిర్మించారు. ఉదాత్తంగా నిలచి ధవళకాంతులీనుతూ బుద్ధుని జ్ఞానతేజాన్ని విరజిమ్ముతున్నట్లుంది. స్థూపానికి పైకి వెళ్లి పరిక్రమణకు ఏర్పాటుంది. నాలుగువైపులా బంగారు వర్ణంలో బుద్ధుని జీవితంలోని నాలుగు ప్రధాన ఘట్టాలు – బాల్యం, తపస్సు, ధర్మప్రవచనం మహపరి నిర్వాణం – మనోహరంగా తీర్చిదిద్దారు. ప్రశాంతత, ముక్తి సామ్రాజ్యాధిపత్యం, సకల జీవుల ముక్తికీ మార్గనిర్దేశం చేస్తున్న ధర్మప్రవచనం, వీటిలో ప్రస్ఫుటంగా గోచరించి, మనస్సునిండా ఆధ్యాత్మిక సుగంధాలు కమ్ముకుంటున్నాయి.

సుదూర కాలంలోనే ఇంతటి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను, అష్టైశ్వర్యాలను, ఆధ్యాత్మిక శిఖరాలను అందుకుని భాసించిన ఆ మణిహారం, ఇప్పుడు కేవలం రెండు కుగ్రామాలుగా మిగిలిపోయింది. ఇవే కలువ, బాసడ్ గ్రామాలు. ఇక్కడి ప్రజలిప్పుడు దుర్భర దారిద్ర్యానికి అలవాటు పడిపోయారు. మిగిలిన బీహారు గ్రామాలవలెనే, ఆ మాటకొస్తే దేశంలో అనేక ప్రాంతాల వలెనే దారిద్ర్యం, అవిద్య, అనారోగ్యం ఇక్కడ తాండవిస్తున్నాయి. కాలమనేది ఏనాడు ఏ రూపు దిద్దుకుంటుందో ఎవరికెరుక. ఇంతటి చారిత్రక కేంద్రంలో మనకు కనిపించేదింత మాత్రమే. ఈ నగరం భూకంప తాకిడికి గురైనట్టు భావిస్తారు. ఏదేమైనా విశాలి సందర్శన, ఇక్కడి శిథిలాలు, వాటి గాథలు తరచిచూచిన కొద్ది అన్ని రంగాల్లోనూ సాటిలేని విశిష్టత సాధించిన ఒక మహానగర స్వరూపం దాని ఔన్నత్యం కనుల ముందావిష్కృతమౌతుంది. ఈ భూమి తన కథలూ, గాథలూ ఈ శిథిలాల మూగ భాషలో వ్యక్తపరుస్తున్నట్లుంది. 2500 సంవత్సరాల కాలగర్భంలోకి దృష్టి సారించినట్లుంది. అదొక అలౌకికానుభవం.

★

కప్పల కాలేజీ

ఈ ప్రపంచంలో రకరకాల కాలేజీలు, కోర్సులున్నాయి. అయితే బిల్ స్టీడ్ అనే మానసిక శాస్త్రవేత్త కప్పల కాలేజి స్థాపించి సరికొత్త సంచలనం సృష్టించాడు. ఈయనగారు 25 సంవత్సరాల పాటు కప్పల మానసిక స్థితిగతులపై పరిశోధనలు జరిపి చివరకు ఈ పనిచేశారు. కాలిఫోర్నియాలోని ఈ కప్పల కాలేజిలో ఆయనగారు కప్పలకు వివిధ రకాల శిక్షణ ఇస్తున్నాడు. ఆ కాలేజిలో శిక్షణ పొందిన కప్పలు బట్టలు ధరిస్తాయి. పాటకు అనుగుణంగా నాట్యం చేస్తాయి. మోటారు వాహనాల పోటీలో పాల్గొంటాయి. హైజంప్ కూడా చేస్తాయి. వీటి వింత చేష్టలు చూడటానికి ప్రజలు తండోపతండాలుగా వెళుతున్నారట? ఈ కాలేజీ కోసం రకరకాల కప్పలను ఇంటికి తీసుకురావడంతో ఆయనకు మొదట భార్య విడాకులిచ్చిందట! కప్పలను శుభ్రంగా స్నానం చేయించి, కొన్ని ప్రత్యేకమైన రికార్డుల ద్వారా వాటిపైకి ధ్వని ప్రసారం చేస్తూ హిప్నటిజం ప్రయోగిస్తారు. ఆ దశలో అవి ప్రవర్తించవలసిన తీరుతెన్నులకు సంబంధించిన సూచనలు చేస్తారు. వాటికి తిరిగి మెళుకువ వచ్చాక కప్పల ప్రవర్తనలో క్రమక్రమంగా మార్పు కనిపిస్తుంది. కప్పలు కూడా బిల్‌స్టీడ్ చెప్పినట్లు నడవటం, గెంతడం చేస్తాయి. ఆ తదుపరి వాటి అదుపులో మార్పు తెస్తారు. వివిధ రకాల వ్యాయామాలు చేయిస్తారు. ఈ కాలేజీల ఆరు వారాల శిక్షణ విజయవంతంగా పూర్తి చేసిన కప్పలకూ డిగ్రీ సర్టిఫికెట్లు ఇస్తారు. ఇదంతా గమ్మత్తుగా వుంది గదా!



క్రికెట్ కథ



ఇప్పటి 'క్రికెట్' ఆటకు 'క్రీగ్' అనే ఆట మూలమని చాలా మంది భావిస్తున్నారు. ఈ ఆటను దాదాపు 1300 సంవత్సరాల క్రితం ఇంగ్లండ్‌లో ఒకటో ఎడ్వర్డ్‌రాజు కాలంలో ఆడేవారట! అయితే పెషావర్‌లో పాకిస్తాన్ పురావస్తు శాఖ తవ్వకాలలో దొరికిన గాంధార శిల్పం క్రికెట్‌కు మరో సాక్ష్యంగా నిలుస్తుంది. ఈ శిల్పం ఇకే అడుగు ఎత్తున్న సున్నపురాతి శిల్పం. ఒక పురుషుడు ఒక చేత్తో బ్యాటు మరో చేత్తో బంతి లాంటి గుండ్రని వస్తువుని పట్టుకున్నట్లుందా శిల్పంలో. దీన్నిబట్టి రెండువేల సంవత్సరాల కిందటే భారత్ ఉపఖండంలో క్రికెట్ ఆట (లేదా అలాంటిది) ఆడేవారన్న సంగతి రుజువు అవుతోందని చరిత్రకారులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఈ శిల్పం లాహోరులో ఉన్న గడ్డఫీ స్టేడియంలో వుంచారు.

తెల్సా!

116 ఏళ్ళనాటి మ్యూజియం

అమెరికాలో పెద్ద మ్యూజియంలలో న్యూయార్క్‌లోని మెట్రోపాలిటన్ మ్యూజియం ఆఫ్ ఆర్ట్ చెప్పుకోదగినది. సాధారణంగా పెద్ద పెద్ద మ్యూజియంలన్నీ

ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నిర్వహింపబడతాయి. కాని మెట్రోపాలిటన్ మ్యూజియంను ప్రజలే నిర్వహిస్తున్నారు.

న్యూయార్క్‌ను సందర్శించే ప్రముఖుల నుంచి సామాన్య పర్యాటకుల వరకూ ఏటా 50 లక్షల మంది ఆ మ్యూజియంను సందర్శిస్తారు. 1870లో ప్రజలే దీనిని స్థాపించారు. దీని విస్తీర్ణం 10 హెక్టార్లు. ఆ మ్యూజియంలో 284 గ్యాలరీలు ఉన్నాయి. ఆ మ్యూజియం 30 లక్షల వస్తువులను మాత్రమే ప్రదర్శనకు ప్రత్యేకించారు. వాటిలో 4 వేల రకాల సంగీత పరికరాలు, 40 వేల రకాల దుస్తులు, వివిధ దేశాలకు చెందిన వస్తువులు ఉన్నాయి. ఈ మ్యూజియానికి రాక్‌ఫెల్లర్, జె.పి మోర్గాన్, వేండర్‌బిల్ట్, వైట్నీ మొదలైన సంపన్నులు కొన్ని లక్షల డాలర్లు విరాళం ఇవ్వడంవల్ల మ్యూజియం నిర్వాహకులు ఇప్పటికీ కొత్త వస్తువులను సేకరించగలుగుతున్నారు. 2000 ఏళ్ళనాటి వస్తువుల దగ్గర నుంచి ఇటీవలి కాలంవరకూ తయారయిన వస్తువులు అన్నిరంగాలకు చెందినవీ, అక్కడ ప్రదర్శితమవుతున్నాయి.

1969 లో మరణించిన రాబర్ట్ వేమాన్ వీలునామా ప్రకారం అతను సేకరించిన కోటి డాలర్లు విలువచేసే పెయింటింగులు ఆ మ్యూజియానికి వచ్చి చేరాయి. అది ప్రభుత్వ ఆధ్వర్యంలో లోని మ్యూజియం కనుక దాని సమావేశాలు జరుపుకోవడానికి అద్దెకు ఇవ్వడందర్వారా మ్యూజియంలో ఓ హోటల్ నడపడం ద్వారా సమకూర్చుకుంటున్నారు.



నవ్వుల్ - పువ్వుల్

ప్రమాణం

కోర్టు గుమస్తా: గీత మీద ప్రమాణం చేసి అంతా నిజమే చెప్పండి

నిందితుడు: సీత మీద చెయ్యి వేసినందుకే నామీద కేసుబెట్టి బొక్కలో తోశారు సార్. మళ్లీ గీత మీద ప్రమాణం చేస్తే ఇంకా ఏమైనా వుందా?

★ ★ ★

వేగం

భార్య: ఏంటండీ! అకస్మాత్తుగా కారు వేగం పెంచారు?

భర్త: పిచ్చిదానా! కారు బ్రేకులు ఫెయిలయ్యాయిలే! యాక్సిడెంట్ అయ్యేలోపు మనం ఎలాగోలా ఇంటికెళ్లాలని వేగం పెంచేశా.

★ ★ ★

రంధ్రం

గోపీ: ఏంట్రా నీ గొడుగుకి రంధ్రం పడింది?

రాజు: అదా! నేనే పెట్టాను.

గోపీ: ఎందుకురా?

రాజు: వాన తగ్గిందో లేదో తెలియాలికదా.

★ ★ ★

నేరం

టి.సి: (ప్యాసెంజర్‌తో) నువ్వు టికెట్ ఎందుకు కొనలేదు? టికెట్ కొనకుండా రైల్లో కూర్చోవడం నేరమని నీకు తెలీదా?

ప్యాసెంజర్: సార్! నేను ఎక్కడ కూర్చున్నానండీ. రైలెక్కిన దగ్గరనుంచి నిలబడే వున్నాను.

★ ★ ★

లేదు

భిక్షగాడు: అమ్మా! దయచూపండమ్మా! బాగా ఆకలిగా వుందమ్మా... అంతేకాదమ్మా... నా కాలు ఒకటి...

గృహిణి: (తలుపు మూసేస్తూ) అది ఇక్కడ లేదు బాబూ!

★ ★ ★

సిమెంట్

పంకజం: ఏంటే మీ ఆయన పొద్దుటినుంచి నోరు మెదపడం లేదు?

పద్మ: పళ్ల డాక్టర్ దగ్గరకెళ్లాంలే. అప్పటినుంచే ఇలా అయ్యారు.

పంకజం: కొంపదీసి పళ్లు పీకేశారా ఏంటి?

పద్మ: అదేం లేదు. ఈయనకు సిమెంట్ పెట్టాలన్నారు డాక్టర్ గారు. పైగా మూడు వేల రూపాయలు ఖర్చవుతాయన్నారు. అదేదో నేనే పెట్టుకుంటానని వచ్చి ఇంట్లో వున్న సిమెంట్ కలిపి పెట్టుకున్నారు. అంతే ఇక నోరు తెరిస్తే ఒట్టు.

★ ★ ★

తిక్క కుదురుతుంది

(ఇద్దరు స్నేహితులు పడవలో ప్రయాణిస్తుంటారు)

ఒకడు: ఒరే పడవ వేగంగా వెళుతోందికదా. మునిగిపోతే ఎలా?

రెండోవాడు: పడవ నడిపేవాడు మన దగ్గర డబ్బులు బాగా వసూలు చేశాడు. అప్పుడుగానీ వాడి తిక్క కుదరదు.



ఏది దగ్గర?

టీచర్: ఒరే రామూ! మనకి చైనా దగ్గరా? చందమామ దగ్గరా?

రాము: చందమామ టీచర్

టీచర్: అదెలారా?

రాము: ఎలాగేంటి టీచర్! చందమామ కనిపిస్తుంది. చైనా కనిపించదుకదా.



పదిహేడేళ్ల ప్రాయంలోనే...

"వావ్! ఏంటిది? చూస్తుంటే ఇతగాడికి పెద్ద వయసున్నట్టులేదు. సిక్స్ ప్యాక్ ...కాదు కాదు... ఎయిట్ ప్యాక్ ఎలా సాధ్యమైంది?!" అనుకుంటున్నారా?

అదేనండీ మరి. కృషి వుంటే ఏదైనా సాధించవచ్చని రుజువు చేశాడీ శాల్తీ. పేరు రిచర్డ్ శాంద్రక్. పుట్టింది ఉక్రెయిన్‌లో. రెండేళ్ల పసివాడిగా వున్నప్పుడే కుటుంబంతో సహా అమెరికా చేరాడు. తండ్రి పావెల్. ప్రపంచ మార్షల్ ఆర్ట్స్ యోధుడు. తల్లి లీనా. ఎరోబిక్స్‌లో సిద్ధహస్తురాలు. తమ చిన్నారి రిచర్డ్‌ని నలుగురూ మెచ్చుకునేలా ఏదో ఒకటి చేయాలన్నది వీరి కోరిక. అంతే! రెండేళ్ల వయసులోనే శిక్షణ ప్రారంభించారు. తేలికపాటి వ్యాయామంతో మొదలెట్టి మెల్లమెల్లగా మార్షల్ ఆర్ట్స్ కూడా నేర్పించసాగారు. కొద్ది సంవత్సరాలకే రిచర్డ్ అవలీలగా 180 పౌండ్ల బరువు ఎత్తసాగాడు. ఎనిమిదేళ్లొచ్చేసరికి మార్షల్ ఆర్ట్స్‌లో బలమైన కిక్కులు, వేగవంతమైన పంచ్‌లు ఇచ్చే శక్తిసామర్థ్యాలను సాధించాడు. మీడియా ఊరుకుంటుందా! ప్రచారం చేసేసింది. దేశదేశాల్లో రిచర్డ్ పేరు మారుమోగింది. ప్రపంచంలోకెల్లా శక్తివంతమైన పిల్లవాడిగా పేరు పొందాడు. సినిమాల్లో సైతం చాన్స్ కొట్టేశాడు.

ఇంతకీ రిచర్డ్ వయసెంతనుకుంటున్నారు?! పదిహేడే!





కలం స్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీకూడా వీళ్లలాగా కలంస్నేహం చెయ్యాలని ఉందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకొని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్‌ఫోటోను అతికించి పోస్ట్ చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలు చెప్పండి. వాళ్లకు కూడా కలం స్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే.
మరి మా అడ్రస్ కలంస్నేహం, ప్రజాశక్తి, మోటూరు హనుమంతరావు భవన్, 21/1, ఆజమాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్.

పేరు: యం. వెన్నెల
చదువు: 5వ తరగతి
వయస్సు: 10 సం॥
స్కూలు: గీతాంజలి ఉన్నత పాఠశాల
లక్ష్యం: టీచర్ కావడం
హాబీలు: పుస్తకాలు చదవడం, పాటలు పాడడం
చిరునామా: యం. వెన్నెల
డాటరాఫ్ యం. సోమ్లానాయక్, మారుతి నగర్, అచ్చంపేట, మహబూబ్ నగర్.

పేరు: జె. అనూష
చదువు: 5వ తరగతి
వయస్సు: 10 సం॥
స్కూలు: గీతాంజలి ఉన్నత పాఠశాల
లక్ష్యం: టీచర్ కావడం
హాబీలు: పాటలుపాడడం, డాన్స్
పుస్తకాలు చదవడం
చిరునామా: జె. అనూష, డాటరాఫ్ జె. వెంకటేష్, చింతల బస్తీ, అచ్చంపేట, మహబూబ్ నగర్.

పేరు: యం.డి. నాజియా
చదువు: 6వ తరగతి
వయస్సు: 11 సం॥
స్కూలు: శ్రీవాణి విద్యాలయం
లక్ష్యం : డాక్టర్ కావడం
హాబీలు:టీవీ చూడడం, పుస్తకాలు చదవడం
చిరునామా: యం.డి. నాజియా
డాటరాఫ్ రాజమ్మద్, నంగునూరు(గ్రా), నంగునూరు(మం), మెదక్.

పేరు:టి. అనూష
చదువు: 8వ తరగతి
వయస్సు: 13 సం॥
స్కూలు: గీతాంజలి ఉన్నత పాఠశాల
లక్ష్యం: ఇంజనీర్ కావడం
హాబీలు: పాటలు పాడడం,
పుస్తకాలు చదవడం
చిరునామా: టి. అనూష
డాటరాఫ్ టి. క్రాంతిరెడ్డి, నడింపల్లి, అచ్చంపేట, మహబూబ్‌నగర్.

పేరు: డి. పరమేశ్వర్
చదువు: 7వ తరగతి
వయస్సు : 13 సం॥
స్కూలు: గీతాంజలి ఉన్నత పాఠశాల
లక్ష్యం : డాక్టర్ కావడం
హాబీలు: పుస్తకాలు చదవడం, క్రికెట్ ఆడడం.
చిరునామా: డి. పరమేశ్వర్
సన్నాఫ్ డి. తిరుపతయ్య, సదగోడు, అచ్చంపేట, మహబూబ్ నగర్.

పేరు: జి. శ్రీకాంత్ గౌడ్
చదువు: 7వ తరగతి
వయస్సు: 13 సం॥
స్కూలు: గీతాంజలి ఉన్నత పాఠశాల
లక్ష్యం : డాక్టర్ కావడం
హాబీలు: క్రికెట్ ఆడడం,
పుస్తకాలు చదవడం
చిరునామా: జి. శ్రీకాంత్ గౌడ్
సన్నాఫ్ జి. నిరంజన్ గౌడ్, లింగోటం, అచ్చంపేట, మహబూబ్ నగర్.

పేరు: వై. సాయికుమార్
చదువు: 8వ తరగతి
నయస్సు: 13 సం॥
స్కూలు : విద్యార్థి సృజన కుటీర్
లక్ష్యం: ఏఎస్ ఆఫీసర్ కావడం
హాబీలు: కొత్త విషయాలను తెలుసుకోవడం, పుస్తకలు చదవడం
చిరునామా: వై. సాయికుమార్
సన్నాఫ్ వై. త్రిపురాంజనేయులు, డోర్.నెం. 7-2/1, ఇందిరానగర్-2, పెనమలూరు (మం), విజయవాడ.

పేరు: టి. ప్రత్యూష
చదువు: 5వ తరగతి
వయస్సు: 11 సం॥
స్కూలు :గీతాంజలి ఉన్నత పాఠశాల
లక్ష్యం: టీచర్ కావడం
హాబీలు: పుస్తకాలు చదవటం, పాటలు పాడడం, కబడ్డీ ఆడడం
చిరునామా: టి. ప్రత్యూష
డాటరాఫ్ టి. రాములు, ఉప్పునుంతల, మహబూబ్ నగర్.